PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 145 | విజయవాడ, సోమవారం 26 డిసెంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 26 December 2022 | Rs

అశ్విన్, అయ్యర్ కొట్టేశారు

- ఢాకా టెస్టులో భారత్ మెరుపు విజయం
- 2-0తో టెస్టు సిరీస్ టీమ్ ఇండియా వశం


లోపలి పేజీలో..

ఎగిరిపోతున్న సంపద

ఏడాదిలో రూ.1.22 లక్షల కోట్లు మాయం

వెనక్కి తీసుకుంటున్న విదేశీ మదుపర్లు

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండంగా ఉందని, విదేశీ పెట్టుబడుదారులు దేశంలో పెట్టుబడులు పెట్టడానికి క్యూ కడుతున్నారంటూ కేంద్ర ప్రభుత్వం పదేపదే చెబుతున్న మాటలకు భిన్నమైన స్థితి ఇది! కొత్తగా పెట్టుబడులు పెట్టే సంగతి అటుంచితే, ఇప్పటికే ఉన్న సంపద కూడా విదేశాలకు ఎగిరిపోతోంది. విదేశీ మదుపర్లు స్టాక్ మార్కెట్ నుండి తమ పెట్టుబడులను ఇతర దేశాలకు తరలించడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు స్టాక్ మార్కెట్ నుండి 1.22 లక్షల కోట్ల రూపాయలు (16.58 బిలియన్ డాలర్లు) విదేశాలకు తరలినట్టు అంచనా. ఇంత పెద్ద మొత్తాన్ని ఒకే ఏడాదిలో విదేశీ మదుపర్లు తరలించుకుపోవడం ఇదే మొదటిసారి. దీని ప్రభావం విదేశీ మారక ద్రవ్య నిల్వలపై పెద్ద ఎత్తున పడుతోంది. ఇప్పటికే భారీ మొత్తంలో విదేశీ నిల్వలు తగ్గిపోయాయి. ఫారిన్ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ (ఎఫ్‌పిఐ)ల వైఖరి ఇదే మాదిరి కొనసాగితే స్టాక్ మార్కెట్ మరింతగా కుప్పకూలే అవశాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా భారత స్టాక్ మార్కెట్‌లో కొనుగోళ్లు చేయడానికి ఆసక్తి చూపిన ఎఫ్‌పిఐలు ఒక్కసారిగా తమ వైఖరి మార్చుకుని, అమ్మకందారులుగా మారారు. నష్టం రాకుండా సాధ్యమైనంత త్వరగా భారత స్టాక్ మార్కెట్‌నుండి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



సూచన : - ఎఫ్‌పిఐ గణాంకాలు ఈ ఏడాది డిసెంబర్ 20 వరకు

ఎందుకీ స్థితి...?

ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కునే పేరుతో భారత రిజర్వు బ్యాంకుతో పాటు వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచుతున్న సంగతి తెలిసిందే. అమెరికన్ ఫెడరల్ బ్యాంకు కూడా ఇదే విధంగా వడ్డీ రేట్లను పెంచుతోంది. దీంతో భారత స్టాక్ మార్కెట్‌తో పోలిస్తే అమెరికాలోని డిపాజిట్ల ద్వారానే ఎక్కువ ఆదాయం వస్తోంది. అందువల్ల లాభం వచ్చే అమెరికన్ బ్యాంకులకు డిపాజిట్ల రూపంలో పెట్టుబడి తరలిపోతోంది. దీంతో పాటు రోజురోజుకి క్షీణిస్తున్న రూపాయి విలువ కూడా సంపద తరలిపోవడానికి కారణమవుతోంది. రూపాయి బలంగా ఉంటే విదేశీ మదుపర్లకు వారి పెట్టుబడులపై ఎక్కువ లాభాలొస్తాయి. అదే రూపాయి విలువ తగ్గితే వారి లాభాలు కూడా తగ్గుతాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా రూపాయి విలువ తగ్గుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది ఇదే సమయాన్ని పరిగణలోకి తీసుకుని అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 10.2 శాతం మేర రూపాయి విలువ తగ్గింది. అదే సమయంలో అమెరికన్ బాండ్ల నుండి వచ్చే ఆదాయం 1.5 శాతం నుండి 3.7 శాతానికి పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నిత్యావసరాల ధరలు కూడా మదుపరులు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవడానికి కారణంగా భావిస్తున్నారు.

ఎలా తగ్గింది ...?

2020వ సంవత్సరానికి స్టాక్ మార్కెట్‌లో 1,72,184 కోట్ల రూపాయలను విదేశీ మదుపర్లు పెట్టుబడులుగా పెట్టారు. కరోనా విజృంభణ సమయంలోనూ ఈ మొత్తం కొనసాగింది. అయితే, ఈ ఏడాది ప్రారంభం నుండి ఈ పరిస్థితి మారింది. విదేశీ మదుపర్లు ఒక్కసారిగా తమ పెట్టుబడులను తరలించడం ప్రారంభించారు. జనవరి నుండి ప్రారంభమైన ఈ వైఖరి డిసెంబర్‌లోనూ కొనసాగింది. ఈ నెల 22వ తేది నాటికి 1,21,905 కోట్ల రూపాయలను తరలించారు.

భారీగా తగ్గుతున్న విదేశీ నిల్వలు

రూపాయి విలువ తగ్గుతున్న ప్రభావం విదేశీ నిల్వలపై భారీగా పడుతోంది. రిజర్వుబ్యాంకు తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం వారం రోజుల్లోనే 4,716 కోట్ల రూపాయల మేర (571 మిలియన్ డాలర్లు) తగ్గాయి. డిసెంబర్ మొదటి వారాంతంలో దేశంలో 564.07 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉండగా, రెండవ వారానికి 563.5 బిలియన్ డాలర్లకు పడిపోయాయని రిజర్వు బ్యాంకు పేర్కొంది. రూపాయి విలువ క్షీణించడం కొనసాగుతుండటంతో ఈ వారంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ప్రారంభంలో దేశంలో 632. 7 బిలియన్ డాలర్ల మేర విదేశీ నిల్వలు ఉండేవి. అప్పటి నుండి ఇప్పటివరకు 11శాతం మేర రూపాయి విలువ క్షీణించింది.



సిటీ

శాంతి కోసం ప్రపంచం అలమటిస్తోంది

క్రిస్మస్ సందేశంలో పోప్ ఫ్రాన్సిస్

వాటికన్ సిటీ : ప్రపంచం శాంతి కోసం అలమటిస్తోందని పోప్ ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ బాసిలికా ప్రధాన బాల్కనీ నుంచి ప్రజలనుద్దేశించి ఆయన ఆదివారం సందేశం ఇచ్చారు. యుద్ధాలు, ఇతర వివాదాలకు ముగింపు పలకాలని అన్నారు. నిరాశ్రయులు, వలసదారులు, శరణార్థులు, పేదలకు సహాయం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'బాధలో ఉన్న వారందరికీ సహాయం చేయడానికి, సంఘీభావం అందించడానికి ప్రభువు మనల్ని ప్రేరేపించుగాక, ఆయుధాల శబ్దాలతో నిండిపోయిన వారి మనసులను ప్రకాశవంతం చేసి, ఈ తెలివిలేని యుద్ధానికి తక్షణమే ముగింపు పలకాలి' అని పేర్కొన్నారు. ఇజ్రాయిల్, పాలస్తీనీయన్ల మధ్య శాంతి చర్చలను పునఃప్రారంభించాలని పిలుపునిచ్చారు.

ధాన్యం రైతుల దైన్యం

- అమ్మిన నెల రోజులకూ ఖాతాల్లో జమవ్వని నగదు
- ప్రభుత్వం రూ. 286.46 కోట్లు ధాన్యం కొనుగోలు
- రూ.19.40 కోట్లు మాత్రమే చెల్లింపులు

లోపలి పేజీలో..



సీనియర్ నటులు

చలపతిరావు కన్నుమూత

- 28న అంత్యక్రియలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలుగు చలనచిత్ర సీమలో మరో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖనటుడు, నిర్మాత తమ్మారెడ్డి చలపతిరావు (78) హఠాన్మరణం చెందారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన కొంతకాలంగా బంజారాహిల్స్‌లోని తన కుమారుడు రవిబాబు వద్ద ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి తీవ్ర స్థాయిలో గుండెపోటు రావడంతో నిద్రలోనే ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండు రోజుల క్రితమే సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణ మృతి చెందగా, ఇప్పుడు చలపతిరావు ఆకస్మిక మరణ వార్తతో టాలీవుడ్‌ను దిగ్భ్రాంతికి గురిచేసింది. అమెరికాలో ఉన్న చలపతిరావు కుమార్తె, ఇతర బంధువులు వచ్చిన తర్వాత జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల వరకు కుమారుడు రవిబాబు రవిబాబు నివాసంలో చలపతిరావు భౌతిక కాయాన్ని ఉంచారు. అనంతరం మహాప్రస్థానానికి తరలించి అక్కడి ఫ్రీజర్‌లో ఉంచారు.

చలపతిరావు మృతికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కూడా నివాళులు తెలియచేశారు. భౌతిక కాయాన్ని మిగతా 2లో

అస్సాం ఎన్‌ఆర్‌సి అప్‌డేట్‌లో అవకతవకలు

- అస్తవ్యస్తంగా సాఫ్ట్‌వేర్‌ల ఎంపిక
- కాగ్ నివేదిక వెల్లడి

గౌహతి : అస్సాంలో నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్‌ఆర్‌సి) అప్‌డేట్ కార్యక్రమంలో అనేక తప్పులు జరిగాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) గుర్తించింది. అప్‌డేట్‌కు ఉపయోగించిన సాఫ్ట్‌వేర్ ఎంపికలోనూ, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు చెల్లించడంలోనూ అనేక వైరుధ్యాలున్నాయని పేర్కొంటూ అస్సాం అసెంబ్లీకి కాగ్ నివేదికను సమర్పించింది. ఎన్‌ఆర్‌సి అప్‌డేట్ కోసం ఉపయోగించాల్సిన కోర్ సాఫ్ట్‌వేర్‌కు బదులుగా వేరే 215 సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించారని కాగ్ తెలిపింది. సరైన ప్రణాళిక లేకుండా ఎన్‌ఆర్‌సి అప్‌డేట్ జరిగిందని నివేదిక విమర్శించింది. నేషనల్ టెండరింగ్ ప్రక్రియను అనుసరించకుండా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సాఫ్ట్‌వేర్ సంస్థల ఎంపిక జరిగిందని, ఇలాంటి సాఫ్ట్‌వేర్‌ల వినియోగంతో డేటా ట్యాంపరింగ్‌కు గురయ్యే ప్రమాదాలు ఎక్కువగా ఉన్నాయని కాగ్ నివేదిక పేర్కొంది.

అవుట్ సోర్సింగ్ సిబ్బందికి 64 శాతం తక్కువ వేతనాలు

ఈ ప్రాజెక్టులో కనీస వేతనాల చట్టాన్ని ఉల్లంఘించినందుకు అప్పటి ఎన్‌ఆర్‌సి కోర్డినేటర్ ప్రతీక్ హజేలాపై చర్యలు తీసుకోవడంతోపాటు సిస్టమ్ ఇంటిగ్రేటర్ విప్రో లిమిటెడ్‌పై జరిమానా విధించాలని కాగ్ సిఫార్సు చేసింది. 'కనీస వేతనాల కంటే తక్కువగా ఆపరేటర్లకు జీతాలు చెల్లించారు' అని కాగ్ తెలిపింది. ఎన్‌ఆర్‌సి సమన్వయ కమిటీ ఆమోదించిన రేటు కంటే అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి 45.59 నుంచి 64.27 శాతం వేతనాలు తక్కువగా చెల్లించారని కాగ్ తెలిపింది. కనీస వేతనాల చట్టాన్ని ఉల్లంఘించడం ద్వారా సిస్టమ్ ఇంటిగ్రేటర్, లేబర్ కాంట్రాక్టర్ విప్రో లిమిటెడ్‌కు రూ.155.83 కోట్ల అదనపు ప్రయోజనం లభించిందని కాగ్ నివేదిక పేర్కొంది. భారత పౌరసత్వాన్ని నిరూపించుకున్న 1971, మార్చి 25కు ముందు నుంచి అస్సాంలో నివసిస్తున్న వారు లేదా వారి వారసులతో అస్సాం ఎన్‌ఆర్‌సిని అప్‌డేట్ చేశారు.

సామాజిక ప్రగతిలో కడప టాప్

- జిల్లాల వారీ ర్యాంకులు విడుదల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సామాజిక ప్రగతి సూచిక (ఎస్‌పిఐ)లో రాష్ట్రంలో కడప జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో చిత్తూరు నిలువగా, చిట్టచివరన కర్నూలు జిల్లా నిలిచింది. ఈ మేరకు రూపొందించిన నివేదికను ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి విడుదల చేసింది. అయితే, ఐదు విభాగాలుగా రూపొందించిన ఈ నివేదికలో అత్యధిక ప్రగతి సాధించిన కేటగిరిలో తెలుగు రాష్ట్రాల నుండి ఒక్క జిల్లా కూడా లేదు. అధిక సామాజిక పురోగతి సాధించిన జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన రెండేసి జిల్లాలు ఉన్నాయి. అప్పర్ మిడిల్ విభాగంలో ఏపి, తెలంగాణకు చెందిన ఏడు జిల్లాలు, లోయర్ మిడిల్ కేటగిరిలో తెలంగాణనుండి 15, ఆంధ్రప్రదేశ్ నుండి నాలుగు జిల్లాలు ఉన్నాయి. తక్కువ సామాజిక పురోగతి సాధించిన జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ నుండి ఒకటి, తెలంగాణ నుండి ఏడు జిల్లాలు ఉన్నాయి. పౌష్టికాహారం, ప్రాథమిక వైద్య సంరక్షణ, త్రాగు నీరు, పారిశుధ్యం, వ్యక్తిగత భద్రత, ఆశ్రయం, ప్రాథమిక విజ్ఞాన సదుపాయం, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ యాక్సెస్, ఆరోగ్యం, ప్రజా క్షేమం (హెల్త్ అండ్ వెల్నెస్), పర్యావరణ నాణ్యత, వ్యక్తిగత హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛ, సమగ్రత, అధునాతన విద్య తదితర అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఈ నివేదికను రూపొందించినట్లు ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి తెలిపింది.

జిల్లాల వారీగా ఇలా..

జిల్లా	పాయింట్లు
కడప	62.2
చిత్తూరు	61.0
విశాఖపట్నం	59.5
కృష్ణా	59.0
తూర్పు గోదావరి	58.9
నెల్లూరు	57.6
పశ్చిమ గోదావరి	57.4
శ్రీకాకుళం	56.8
గుంటూరు	56.1
విజయనగరం	55.6
ప్రకాశం	54.4
అనంతపురం	52.9
కర్నూలు	51.1

పోషకాహారం, ప్రాథమిక వైద్య సంరక్షణ, మహిళలు, పిల్లల్లో రక్తహీనతపై పనితీరులో కేరళ అగ్రగామిగా నిలిచింది.

కేరళ అత్యధికంగా 67.68 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. లక్షద్వీప్ 66.58 స్కోర్‌తో, సిక్కిం 65.57 స్కోర్‌తో రెండు, మూడు స్థానంల్లో ఉన్నాయి. బీహార్ (28.86 స్కోర్), ఉత్తరప్రదేశ్ (33.36 స్కోర్), జార్ఖండ్ (35.47 స్కోర్) కిందన ఉన్నాయి. మహిళల్లో రక్తహీనత ప్రాబల్యాన్ని తగ్గించడంలో కేరళ అధిక కాంపోనెంట్ స్కోర్ మెచ్చుకోదగిన పనితీరుకు కారణమని చెప్పవచ్చు. 6-59 నెలల వయస్సు గల పిల్లలలో రక్తహీనత విషయంలో దేశంలోనే అతి తక్కువ ప్రాబల్యం రేటు కేరళ సాధించింది. దేశంలోనే అత్యల్ప శిశు, పిల్లలు, ప్రసూతి మరణాల రేటులో కేరళ ఒకటిగా నిలిచింది. న్యూట్రిషన్, బేసిక్ మెడికల్ కేర్ కాంపోనెంట్‌లో 340 జిల్లాలు జాతీయ సగటు 38.59 కంటే ఎక్కువ స్కోర్ చేశాయి. ఇందులో కేరళకు చెందిన పతనంతిట్ట (63.09), కోజికోడ్ (62.21), తిరువంతపురం (62.03), అరుణాచల్ ప్రదేశ్‌కి చెందిన లాంగ్డింగ్ (62.92) అత్యధిక స్కోర్ చేసిన జిల్లాలుగా ఉన్నాయి. బీహార్‌కు చెందిన బంకా (18.57), లఖిసరాయ్ (18.58) అత్యల్ప స్కోరును సాధించాయి.



నేపాల్ కొత్త ప్రధానిగా ప్రచండ

కాట్మండు : నేపాల్ కొత్త ప్రధానిగా కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ - మావోయిస్టు సెంటర్ ఛైర్మన్ పుష్ప కమాల్ దహాల్ అలియాస్ ప్రచండ బాధ్యతలు చేపట్టనున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ఆయన పదవీ స్వీకార ప్రమాణం చేస్తారు. ప్రచండ నేపాల్ రాష్ట్రపతి బిద్యాదేవి బండారిని ఆదివారం సాయంత్రం కలిసి, మెజారిటీ సభ్యుల మద్దతు ఉందని తెలుపుతూ లేఖ అందజేశారు. రొటేషన్ పద్ధతిలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు ప్రచండ, మాజీ ప్రధాని కెపి శర్మ ఓలి మధ్య అవగాహన కుదిరింది. 165 మంది సభ్యుల బలమున్న మొత్తం ఏడు ప్రతిపక్ష పార్టీలు ప్రచండ నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇస్తున్నట్లు ఆదివారం ప్రకటించాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 275 స్థానాలకు గాను 89 స్థానాలను గెలుచుకుని అతి పెద్ద పార్టీగా ఏర్పడిన నేపాలి కాంగ్రెస్ గడువులోపున ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయింది.

నేడు ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా ప్రకటన

- అభ్యంతరాలకు గడువు పొడిగించాలని టీచర్ల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల్లో సీనియార్టీ జాబితాను పాఠశాల విద్యాశాఖ సోమవారం ప్రకటించనుంది. ఈ నెల 14 నుంచి 20 వరకు జరిగిన దరఖాస్తు ప్రక్రియలో 80 వేల మంది ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లు ఎంచుకునే ప్రక్రియ మంగళవారం నుంచి జనవరి 1 వరకు 6 రోజుల పాటు జరగనుంది. అయితే, షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన బదిలీ దరఖాస్తుల ప్రక్రియను మూడు రోజులు పొడిగించిన విద్యాశాఖ దానికి తగ్గట్టుగా అభ్యంతరాలు తెలియచేయడానికి గడువు ఇవ్వలేదు. దీంతో ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సీనియార్టీ జాబితాపై వచ్చిన అభ్యంతరాలను సోమవారం లోపు పరిష్కరించాలని పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్(సర్వీస్) మువ్వా రామలింగం ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆదివారం 5 గంటల్లోపు అభ్యంతరాల స్వీకరణకు గడువును ముగించడంతో అనేక మంది అభ్యంతరాలు తెలిపేందుకు అవకాశం లేకుండా పోయిందని ఉపాధ్యాయులు అంటున్నారు . 2021లో బదిలీ అయిన ఉపాధ్యాయులు మరలా ఇప్పుడు రేషనలైజేషన్ వల్ల బదిలీ అవుతున్న వారికి పాత పాయింట్లు కొంతమందికి రాలేదని, అదేవిధంగా ఆరోగ్య సమస్యలు వంటి వాటికి కూడా పాయింట్లు రాలేదని చెబుతున్నారు. ఇలాంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని నిజమైన సీనియార్టీ జాబితా ప్రకటించాలని కోరుతున్నారు. మరోవైపు పోస్టులు బ్లాక్‌చేయడంపై కూడా మండిపడుతున్నారు. ఈ బ్లాక్ చేసిన పోస్టుల్లో సిఫార్సు బదిలీలు చేస్తుందా అనే అనుమానం ఉపాధ్యాయుల్లో నెలకొంది. అయితే ఈ పోస్టుల్లో డిఎస్సి-1998, డిఎస్సి-2008 ఎంటిఎస్ అభ్యర్థులకు అవకాశం ఇస్తామని విద్యాశాఖ చెబుతోంది. ఈ పోస్టుల్లో ముందు తమకు ప్రాధాన్యత కల్పించి తరువాత ఎంటిఎస్ అభ్యర్థులకు ఇవ్వాలని టీచర్లు కోరుతున్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని న్యాయబద్ధంగా ప్రక్రియ జరపాలని యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు కోరారు. ఏ పాఠశాలల్లో కూడా పోస్టులను బ్లాక్ చేయొద్దని, అన్ని పోస్టులను చూపించాలని డిమాండ్ చేశారు. అభ్యంతరాలు తెలిపేందుకు మరికొంత సమయం ఇచ్చి భౌతికంగా కూడా అభ్యంతరాలు స్వీకరించాలని కోరారు.



ఆయిల్‌పామ్ మొక్కలు ఇచ్చేది ఎప్పుడు?

- రైతుల ఎదురుచూపులు
- బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్న కంపెనీలు!
- పట్టించుకోని అధికారులు

లోపలి పేజీలో..

'రియల్ ఎస్టేట్' సమస్యలపై ప్రభుత్వ దృష్టి

- క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ముగింపు కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్

సర్వం సన్నద్ధం

- నేటి నుంచి పోచంపల్లిలో ఎన్‌పిఆర్‌డి జాతీయ మహాసభ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) మూడవ జాతీయ మహాసభ హైదరాబాద్‌కు సమీపంలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన పోచంపల్లి మండల కేంద్రంలోని దేశ్‌ముఖ్‌లో సోమవారం నుంచి బుధవారం వరకూ మూడు రోజులపాటు జరగనుంది. మహాసభ ప్రారంభం సందర్భంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథులుగా పశ్చిమ బెంగాల్ విద్యా శాఖ మాజీ మంత్రి జి.కాంతిగంగూలి, ఎన్‌పిఆర్‌డి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్, హెలెన్ కెల్లర్ విద్యాసంస్థల చైర్మన్ పఠాన్ ఉమ్మర్ ఖాన్, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.జనార్థన్‌రెడ్డి, సిహెచ్.సాయమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య హాజరవుతున్నారు. మహాసభ నిర్వహణకు ఆహ్వాన కమిటీ అన్ని ఏర్పాట్లూ చేసింది. తెలంగాణ సంప్రదాయం, సంస్కృతి ఉట్టిపడేలా మహాసభ ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. 22 రాష్ట్రాల నుంచి 500 మంది ప్రతినిధులు రానున్నారు. ఆయా రాష్ట్రాల్లో వికలాంగుల పరిస్థితి, అమలవుతున్న సంక్షేమ పథకాలు, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు, వికలాంగుల పట్ల ప్రభుత్వాలు వ్యవహరిస్తోన్న తీరు, దేశంలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వ విధానాలు, ఎన్‌పిఆర్‌డి కార్యాచరణపై చర్చించనున్నారు. వికలాంగుల సంక్షేమం, హక్కుల సాధనకు పలు తీర్మానాలు చేయనున్నారు.



రాజ్‌భవన్‌లో ఘనంగా 'సుపరిపాలన దినోత్సవం'

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి దేశ అభివృద్ధి కోసం ఎంతో ముందు చూపుతో వ్యవహరించారని, దేశాభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా రాజ్‌భవన్‌లో ఆదివారం 'సుపరిపాలన దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. గవర్నర్ మాట్లాడుతూ వాజ్‌పేయి హయంలో శ్రీకారం చుట్టిన పలు పథకాలను, వాటివల్ల ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్, ఉప కార్యదర్శి నారాయణ స్వామి, పలువురు మాజీ సైనికాధికారులు, రాజ్‌భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఎస్టిల కంటే రెడ్లు పేదవాళ్లా?

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్టిల కంటే రెడ్డి సామాజిక తరగతికి చెందినవాళ్లే పేదలా? అని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఎస్సి, ఎస్టి, బిసిల ఓట్లతో గద్దెనెక్కిన జగన్ అధికారంలోకి వచ్చి ..వారికి అడుగడుగునా అన్యాయం చేస్తున్నారని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్ తన సామాజిక తరగతి అయిన రెడ్లకే పెద్దపీట వేసి మిగిలిన వారికి 'కత్తిపీట' వేస్తున్నారని తీవ్ర పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022-23 బడ్జెట్‌లో 5.53 శాతం ఉన్న గిరిజనుల పెన్షన్లకు రూ.971 కోట్లు కేటాయించి రెడ్డి కార్పొరేషన్ పెన్షన్లకు మాత్రం రూ.1555 కోట్లు కేటాయించారని విమర్శించారు. పైగా రెడ్లలో పేదరికం పెరిగినట్లు లెక్కలు చెబుతున్నారని పేర్కొన్నారు. నిజంగా రెడ్డి సామాజిక తరగతిలో పేదరికం పెరిగినా దామాషా ప్రకారం 17.08 శాతం ఉన్న ఎస్సిలకు రూ.7 వేల కోట్లు, 50 శాతానికి పైగా ఉన్న బిసిలకు రూ.16 వేల కోట్లు కేటాయించాలని ఆయన కోరారు. కానీ జగన్ మాత్రం ఎస్సిలకు కేవలం రూ.3 వేల కోట్లు, బిసిలకు రూ.8 వేల కోట్లు కేటాయించి సగం నిధులు కోత కోశారని విమర్శించారు. ఎస్సి, ఎస్టి, బిసిలంటే ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఒక కులానికి మాత్రమే అధిక ప్రాధాన్యత ఇవ్వటం ఏమిటని ప్రశ్నించారు. జగన్ చేస్తున్న ఈ మోసాన్ని ఎస్సి, ఎస్టి, బిసిలంతా గ్రహించాలని ఆయన కోరారు.

వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించడమే లక్ష్యం

- జివిఎల్ నరసింహారావు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజలను కష్టాలకు గురిచేస్తోన్న వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించడమే తమ లక్ష్యమని రాజ్యసభ సభ్యులు, బిజెపి నాయకులు జి.వి.ఎల్.నరసింహారావు అన్నారు. గుంటూరులోని బిజెపి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడున్నరేళ్లుగా దుష్ట, అరాచక పాలన నడుస్తోందని విమర్శించారు.

రెండు ప్రధాన రాజకీయ పార్టీలు రాష్ట్రంలో కుటుంబ పాలనకు ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. బిజెపి సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, కాయితి సైదారెడ్డి, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు పాల్గొన్నారు.



పులివెందుల చర్చిలో జగన్‌కు క్రిస్మస్ కేక్ తినిపిస్తున్న వైఎస్ విజయమ్మ



విజయవాడలోని సెయింట్ పీటర్స్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ప్రజలు

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- పులివెందుల చర్చిలో ముఖ్యమంత్రి జగన్ ప్రార్థనలు
- ప్రజా సంక్షేమమే ధ్యేయమని వెల్లడి

ప్రజాశక్తి - యంత్రాంగం

క్రిస్మస్ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నాడు ఘనంగా జరిగాయి. రాష్ట్రంలోని చర్చిలన్నీ విద్యుద్దీపాలంకరణతో శోభాయమానంగా కాంతులీనాయి. సామూహిక ప్రార్థనలతో చర్చి ప్రాంగణాలు మార్మోగాయి. ఉదయం నుంచే ప్రజలు తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల చర్చిలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సకుటుంబ సమేతంగా ప్రార్థనలు నిర్వహిచారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్న తమ ప్రభుత్వానికి దేవుడి కృప ఎల్లవేళలా ఉంటుందని జగన్ ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో ఈ క్రిస్మస్ పండుగ ఆనందాలను, సంతోషాలను నింపాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా చివరి రోజు ఆదివారం ఉదయం ఆయన ఇడుపులపాయ నుంచి హెలికాప్టర్‌లో పులివెందులకు చేరుకొని క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. సిఎస్ఐ టౌన్ చర్చి పాస్టర్ నుంచి క్రిస్మస్ పండుగ సందేశాన్ని స్వీకరించిన అనంతరం తన తల్లి విజయమ్మతో కలిసి క్రిస్మస్ కేకు కట్ చేశారు. చర్చి అసోసియేషన్ నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ రోజున ఏటా తన సొంత గడ్డపై ఇదే చర్చిలో కుటుంబ సభ్యులు, బంధుగణం, స్నేహితులతో కలిసి పండుగ వేడుకలో పాల్గొనడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జగన్ భార్య వైఎస్ భారతి, కడప ఎంపి అవినాష్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్ బాషా, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుణదలలో అంబరాన్నంటిన సంబరాలు

విజయవాడ సమీపంలోని గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. ఆదివారం ఉదయం వేడుకలను ప్రారంభించిన మేరీమాత పుణ్యక్షేత్రం రెక్టార్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాలి, దయ, శాంతి, ప్రేమ కలిగి ఉండాలని ఏసుక్రీస్తు చెప్పారని, ఆ విధంగా ప్రతి ఒక్కరూ నడచుకోవాలని అన్నారు. అనంతరం గుణదల మాత పుణ్యక్షేత్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూజాపీఠంపై ఆయనతోపాటు దివ్యవాణి జోనల్ డైరెక్టర్ ఫాదర్ బుర్రి జాన్ పీటర్, సహాయ గురువులు ఫాదర్ గోని నరేష్... క్రిస్మస్ సమిష్టి దివ్య పూజాబలి సమర్పించారు. జయరాజు కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

- విశాఖలోని నోవాటెల్ హోటల్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక రథంలో శాంతాక్లాజ్ పిల్లలకు చాక్లెట్లు , టోపీలను పంచారు.
- విజయనగరంలోని ఎస్ఎంబి చర్చిలో జరిగిన క్రిస్మస్ ప్రార్థనల్లో మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంచి పనులు చేస్తూ తోటి వారికి సాయమందించాలని సూచించారు.
- నెల్లూరు సంతపేట సెయింట్ జోసెఫ్ చర్చిలో బాలయేసును ప్రతిష్టించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే అనిల్ కుమార్ పాల్గొన్నారు.
- ఒంగోలులోని బాప్టిస్టు చర్చిలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకాశం జిల్లా గిద్దలూరులో సిఎస్ఐ చర్చిని బెలూన్లతో అందంగా అలంకరించారు.
- యానాంలోనూ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అక్కడి రోమన్ క్యాథలిక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.
- అనంతపురంలోని సిఎస్ఐ చర్చిలో జరిగిన వేడుకల్లో టిడిపి నేత, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి పాల్గొన్నారు. సర్వమత సారాంశం ఒక్కటేనని, దేవుడి దృష్టిలో అందరూ సమానులేనని ఆయన అన్నారు. నంద్యాల చర్చికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రార్థనలు నిర్వహించారు.

రావూరి అర్జునరావు కన్నుమూత

ప్రజాశక్తి- హైదరాబాద్



ప్రముఖ నాస్తికులు, 'గోరా' పెద్దల్లుడు రావూరి అర్జునరావు (105) హైదరాబాద్‌లో ఆదివారం కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని ప్రజల దర్శనార్థం విజయవాడలోని నాస్తిక కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం ఉంచనున్నారు. భౌతికకాయాన్ని విజయవాడలోని మెడికల్ కళాశాలకు డొనేట్ చేయనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అర్జునరావు డాక్టర్ సమరం గోపరాజు అక్క మనోరమ భర్త.

పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్లకు బాధ్యతలు అప్పగింత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కసరత్తు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా నూతనంగా భాధ్యతలు చేపట్టిన పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్లకు పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా బాధ్యతలను పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అప్పజెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గాలతో పాటు పార్టీ రాష్ట్ర స్థాయి అనుబంధ సంఘాలను పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు స్వయంగా పర్యవేక్షించనున్నారు. నరసరావుపేట, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, నంద్యాల, కర్నూలు పార్లమెంటరీ నియోజకవర్గాల బాధ్యతలను పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలికి అప్పజెప్పారు. మరో వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ హిందూపురం, అనంతపురం, కడప, చిత్తూరు, రాజంపేట, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గాలు కేటాయించారు. సుంకర పద్మశ్రీకి ఏలూరు, నరసాపురం, రాజమండ్రి, అమలాపురం, కాకినాడ, మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పి ప్రకాష్‌రెడ్డికి అనకాపల్లి, అరకు, విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ బాధ్యతలు అప్పజెప్పారు.



జెవివి శిక్షణా తరగతులకు హాజరైన వారితో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

యువతలో శాస్త్రీయ దృక్పథం పెరగాలి

- జెవివి రాష్ట్ర వైజ్ఞానిక తరగతుల్లో వక్తలు

ప్రజాశక్తి- ఇబ్రహీంపట్నం (ఎన్‌టిఆర్ జిల్లా)

యువతలో శాస్త్రీయ దృక్పథం పెరగాలని పలువురు వక్తలు అన్నారు. జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి మున్సిపాలిటీలోని క్రాంతి హైస్కూల్‌లో రెండు రోజులపాటు జరగనున్న రాష్ట్ర వైజ్ఞానిక తరగతులను డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల ప్రిన్సిపల్ మహభాష ఆదివారం ప్రారంభించారు. ఈ తరగతులకు రాష్ట్ర నలుమూలల నుండి జెవివి కార్యకర్తలు హాజరయ్యారు.

ప్రధానవక్తగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. మూఢనమ్మకాల వ్యాప్తిని అరికట్టడంలోనూ, రాజ్యాంగం నిర్దేశించిన శాస్త్రీయ ఆలోచన విధానాలను ప్రచారం చేయడంలోనూ జెవివి క్రియాశీలకమైన పాత్ర పోషిస్తోందన్నారు. జెవివి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, మురళీధర్ మాట్లాడుతూ నేటి యువతలో నైపుణ్యాలు అనేకం ఉన్నాయని, వాటిని మెరుగుపర్చుకుంటే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. యువత అభివృద్ధికి మూఢనమ్మకాలు ఆటంకంగా మారుతున్నాయని తెలిపారు. నమ్మకాలకు, మూఢనమ్మకాలకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని గమనించాలన్నారు. జిల్లా నాయకులు వెనిగళ్ల మురళీమోహన్, ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు, కొండపల్లి ప్రధాన కార్యదర్శి సంపసాల నాగరాజు పాల్గొన్నారు.

ట్రేసర్, ట్రాకింగ్‌తో టోల్ వసూళ్లు

- త్వరలో జిపిఎస్ సాంకేతికతతో సరికొత్త బాదుడు
- టోల్‌గేట్ల తొలగింపుతో ఉపాధికి కోత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ రహదారులపై టోలు వసూలులో పెనుమార్పులు రానున్నాయి. వాహనదారులపై కొత్త తరహా బాదుడుకు కేంద్రంలోని మోడీ సర్కార్ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతమున్న టోల్‌ప్లాజాలన్నీ కనుమరుగయ్యేవీలుంది. వీటి స్థానంలో జిపిఎస్ సాంకేతిక పరిజ్ఞానం తీసుకొచ్చి వాహనదారులపై భారాలు వేయనున్నారు. దీనివల్ల టోల్‌గేట్ల సంఖ్య కూడా తగ్గిపోవడం లేదా పూర్తిగా కనుమరగవ్వడం వల్ల ఆ మేరకు వాటిలో ఉపాధి పొందుతున్న కార్మికులు రోడ్డునపడే పరిస్థితి తలేత్తనుంది. కొత్త విధానంలో..ప్రస్తుతమున్న టోల్‌ప్లాజాలను తొలగించి రోడ్లపై ఏర్పాటు చేసే కెమెరాలతో జిపిఎస్ సాంకేతిక పరిజ్ఞానంతో టోలు వసూలు చేస్తారు. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. జాతీయ రహదారి పైకి వచ్చే వాహనాల నుండి ఒక్క కిలోమీటర్‌కు కూడా మినహాయింపు లేకుండా ప్రతి కిలోమీటర్‌కు టోల్‌ఫీజ్‌ను వసూలు చేయనున్నారు. ఇప్పటిదాకా టోల్‌ప్లాజాల వద్దే టోల్‌ఫీజ్ వసూలు చేస్తుండగా..ఇకపై జాతీయ రహదారి పైకి వస్తే చాలు వాహనదారుల నుంచి టోల్‌ఫీజ్ వసూలు చేసేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోంది. ప్రతివాహనం ఫాస్టాగ్‌ను పెట్టుకొని టోల్‌గేట్ల వద్ద ఆటోమేటిక్‌గా టోల్‌ఫీజ్‌లను ఎలా చెల్లిస్తారో ఇకపై రోడ్డుమీదికి వచ్చిన ప్రతి వాహనం ఎన్ని కిలోమీటర్లు ప్రయాణం చేసిందో ఆ మేర ఫీజ్‌ను ఆ వాహనం రోడ్డు దిగగానే ఫీజు కింద వసూలు చేసే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఇప్పటి దాకా టోల్‌గేట్ సమీప గ్రామాలకు చెందిన ప్రజల వాహనాలకు మినహాయింపులు వుండేవి. జిపిఎస్ పద్ధతిలో అలాంటి వెసులుబాటుకు మోడీ సర్కార్ మంగళం పాడనుంది. ప్రతి వాహనానికి ఇకపై ఫాస్టాగ్ స్థానంలో జిపిఎస్ ట్రాకర్‌ను తప్పనిసరి చేస్తారు. జిపిఎస్ ట్రాకర్ వున్న వాహనం రోడ్డు ఎక్కగానే కౌంట్ మొదలవుతుంది. ఆ రోడ్ దిగగానే ఎన్ని కిలోమీటర్లు ప్రయాణం చేసిందో లెక్కకట్టి కిలోమీటర్‌కు ఫిక్స్ చేసిన ఫీజు ప్రకారం టోల్‌ఫీజును వాహనదారుల ఖాతా నుండి కట్ అవుతుంది. ఈ విధానంను 2023 జూన్ నుండి అమలులోకి తీసుకురానున్నారు. 2024లోపు రాష్ట్రంలో వుండే టోల్‌ప్లాజాలు అన్నీ కనుమరుగు కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వున్న 8615 కిలోమీటర్ల జాతీయ రహదారుల రోడ్లకు టోల్ ఫీజ్‌లు వసూలు చేస్తున్నారు. అలాగే రాష్ట్రంలోని వినుకొండ, తిరుపతి సమీపంలో రాష్ట్ర రహదారులకు కూడా టోల్ ఫీజ్ వసూలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 57 టోల్‌ప్లాజాలు వుంటే అందులో చెన్నయ్-కోల్‌కొత రోడ్డుపైనే 19 టోల్ గేట్లు వున్నాయి. ఈ టోల్‌గేట్లన్నింటి స్థానంలో జిపిఎస్ పద్ధతిలో టోల్‌ఫీజు వసూళ్లకు ఏర్పాట్లు చేయనున్నారు. ప్రస్తుతం టోల్‌గేట్లలో ఉపాధి పొందుతున్నవారు కూడా రోడ్డున పడే వీలుంది.



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు

దేశ సంపదను ప్రయివేటుపరం చేయడం తగదు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగ సంస్థలు దేశ సంపదని, వాటిని ప్రయివేటు పరం చేయాలని చూడడం తగదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 682వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎఐటియుసికి చెందిన స్టీల్ కాంట్రాక్టు కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు నందికి తాతారావు, మంత్రి రవి, ఎస్ మురళీకృష్ణ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోన్న బిజెపి ప్రభుత్వానికి భయంపుట్టేలా కార్మిక వర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తోన్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలోని అనేక పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ పేరుతో తన అనుయాయులకు చెందిన బడా కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం సుదీర్ఘకాలంగా పోరాటం సాగుతున్నా మోడీ సర్కారు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నేతలు డి ఆదినారాయణ, జె రామకృష్ణ, సుబ్బయ్య, రామస్వామి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులను కొనసాగించాలి

- ముఖ్యమంత్రికి వి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లాలో 16వ నెంబర్ జాతీయరహదారిపై చిలకపాలెం వద్దనున్న టోల్‌ప్లాజాలో పనిచేస్తున్న కార్మికులను ఎలాంటి నోటీస్‌లు ఇవ్వకుండా తొలగించారని, వారిని కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. చిలకపాలెం టోల్‌ప్లాజాలో 15 ఏళ్లుగా పనిచేస్తున్న 106 మంది కార్మికులను ఎలాంటి నోటీస్‌లు ఇవ్వకుండా ఈ నెల 8వ తేదీ నుండి విధులకు రానివ్వకుండా నిలిపేశారని పేర్కొన్నారు. టోల్‌ప్లాజా నిర్వహకులు ఆదాయంరావడం లేదన్న కారణంతో అక్కడికి దగ్గరలో వున్న మడపాం, నాతవలస టోల్‌ప్లాజాలలో రేట్లను పెంచి చిలకపాలెం వద్దవున్న టోల్‌ప్లాజాను మూసివేశారని వివరించారు. దాదాపు 15 ఏళ్లుగా ఇదే జీవనంగా ఉపాధి పొందుతున్న 106 మంది కార్మికులు రోడ్డున పడ్డారని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేకపోవడంతో పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక, ఇంటి అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం వుందని పేర్కొన్నారు. 106 మంది కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. చిలకపాలెం టోల్‌ప్లాజాలో పనిచేసిన కార్మికులను మడపాం, నాతవలస టోల్‌ప్లాజాలలో సర్దుబాటు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. అలాగే వారిని అకారణంగా తొలగించినందున యాజమాన్యం నుంచి తగిన పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.





సూర్యమోహన్ సంస్మరణ సభకు హాజరైన ఆయన సహచరులు, అభ్యుదయ వాదులు

నిబద్ధతే జీవితం..

- బొమ్మారెడ్డి సూర్యమోహన్ సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డాక్టర్ బొమ్మారెడ్డి సూర్యమోహన్ ప్రజల పట్ల నిజమైన నిబద్ధతతో వైద్య వృత్తికి జీవితాంతం అంకితమైనారని పలువురు వక్తలు అన్నారు. 'సూర్యమోహన్ జ్ఞాపకాలను పంచుకుందాం..' పేరిట సంస్మరణ సభను ఆయన కుటుంబసభ్యులు విజయవాడలోని మెట్రోపాలిటన్ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన సహచరులు, అభ్యుదయ వాదులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రసంగించిన ప్రతి ఒక్కరు వైద్యవృత్తిలో ఆయన అంకితమైన తీరును, పేదలకు చికిత్స అందించడానికి తపన పడిన తీరును వివరించారు. తనదైన ప్రత్యేక శైలిలో జూనియర్లను ఆయన తీర్చి దిద్దిన తీరును, వారిని ఉత్తమ వైద్యులుగా తీర్చిదిద్దిన విధానాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజలతో పాటు వైద్య వృత్తిలో ఎదగాలనుకున్న వారికి కూడా ఆయన ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండేవారని చెప్పారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ వృత్తిపట్ల నిబద్ధత, ప్రజల పట్ల ఉన్న సేవా దృష్టి ఆయనను ఆదర్శమైన వైద్యులుగా నిలిపిందన్నారు. సూర్యమోహన్ తన తండ్రి వి.ఆర్ బొమ్మారెడ్డి నుండి ప్రజల పట్ల, సమాజం పట్ల అంకిత భావంతో వ్యవహరించే తీరును ఆయన అలవరుచుకున్నారన్నారు. బొమ్మారెడ్డి ఆశయాలతో అదే బాటలో పనిచేశారని తెలిపారు. ప్రజాశక్తి సంపాదకులు బి తులసీదాస్ మాట్లాడుతూ విఆర్ బొమ్మారెడ్డి ప్రజాశక్తిలో సుదీర్ఘకాలం పనిచేసి ప్రజాశక్తిమంతుడుగా పేరు తెచ్చుకున్నారన్నారు. సూర్యకుమార్ ప్రజలకు నిబద్ధతతో వైద్య సేవలందించారని తెలిపారు. బొమ్మారెడ్డి స్మారకంగా ప్రజాశక్తి అందించే ఉత్తమ జర్నలిస్టు అవార్డుకు సహాయం అందించారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు కృషి చేశారని చెప్పారు. వి.ఆర్ బొమ్మారెడ్డి కడవరకు మార్క్సిజానికి కట్టుబడి ఉన్నారని ఆ సిద్ధాంతపు వెలుగులోనే పేదలకోసం సూర్యమోహన్ జీవితాంతం పనిచేశారని అన్నారు వైద్య రంగంలో సూర్యకుమార్ చేసిన సేవలను ప్రముఖ వైద్యులు సుధాకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బ్రహ్మానందం, అప్పారావు, కృష్ణమోహన్, ప్రముఖ న్యాయవాదులు సుంకర రాజేంద్రప్రసాద్, రఘు, సూర్యమోహన్ భార్య అరుణ, కుమారులు భాస్కర్, చందు, బంధుమిత్రులు, స్నేహితులు పాల్గొన్నారు.

చలపతిరావు కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, నటులు చిరంజీవి, వెంకటేశ్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. 1944 మేనెల 8వ తేదిన కృష్ణా జిల్లా పామర్రను మండలం బల్లిపర్రులో చలపతిరావు జన్మించారు. ఎన్‌టిఆర్ ప్రోత్సాహంతో సినీరంగంలోకి ప్రవేశించిన ఆయన 1500కు పైగా సినిమాలలో నటించారు. నాలుగైదు రోజల క్రితం కూడా ఒక సినిమా షూటింగ్‌లో పాల్గొన్నట్లు ఆయన కుమారుడు తెలిపారు. కథానాయకుడు సినిమాతో చిత్రరంగ ప్రవేశం చేసిన ఆయన మూడు తరాల నటులతో కలిసి నటించారు. సహాయ నటుడిగా, ప్రతినాయకుడిగా మెప్పించారు. కలియుగ కృష్ణుడు, కడప రెడ్డమ్మ, జగన్నాటకం, పెళ్లంటే నూరేళ్ల పంట, తదితర సినిమాలకు ఆయన నిర్మాతగా వ్యవహరించారు.

పలువురి నివాళి...

సినీ నటులు గోపీచంద్, రాజశేఖర్, జీవిత, ఆర్.నారాయణమూర్తి, సాయికుమార్, తరుణ్, భానుచందర్, మాదాల రవి, బెనర్జీ, అశోక్‌కుమార్, నిర్మాతలు దగ్గుబాటి సురేష్, శ్యాంప్రసాద్ రెడ్డి, ఎస్‌వి.కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, దర్శకులు విజయేంద్ర ప్రసాద్, నందమూరి రామకృష్ణ తదితరులు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. చలపతిరావు కుమారుడు రవిబాబు, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. చలపపతిరావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. చలపతిరావు మృతి పట్ల సిఎం కెసిఆర్ సంతాపం తెలిపారు. వైవిధ్యంతో కూడిన పాత్రల్లో వందల చిత్రాల్లో నటించిన ఆయన తెలుగు వెండితెరపై తనదైన ముద్రవేశారని అన్నారు. నటుడిగా, నిర్మాతగా మూడు తరాల నటులతో పనిచేసిన ఆయన మరణం సినీరంగానికి తీరనిలోటని సిఎం విచారం వ్యక్తం చేశారు. చలపతిరావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలి పారు. చలపతిరావు మృతి పట్ల టిడిపి అధినేత చంద్రబాబు సంతాపం తెలిపారు.



నివాళ్లర్పిస్తున్న చిరంజీవి

గుడివాడలో ఉద్రిక్తత.

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావికి వైసిపి నాయకుని బెదిరింపు
- లాఠీఛార్జి చేసి అల్లరి మూకలను చెదరగొట్టిన పోలీసులు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

గుడివాడలో వైసిపి, టిడిపి గ్రూపులు బాహాబాహీకి దిగాయి. పెట్రోలు ప్యాకెట్లతో టిడిపి కార్యాలయంతోపాటు ఆ పార్టీ కార్యకర్తలపై వైసిపి కార్యకర్తలు దాడికి ప్రయత్నించడం తీవ్ర వివాదానికి దారి తీసింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి అల్లరి మూకలను చెదరగొట్టడంతో వివాదం సర్దు మణిగింది. ఈ ఘటనపై ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... వంగవీటి రంగా వర్ధంతిని నిర్వహించడానికి మాజీ ఎమ్మెల్యే, టిడిపి గుడివాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి వెంకటేశ్వరరావు సోమవారం సంసిద్ధులయ్యారు. వైసిపి గుడివాడ నాయకుడు మెరుగుమాల కాళి ఫోన్ చేసి రంగా వర్ధంతి మీరెలా నిర్వహిస్తారు? నిర్వహిస్తే చంపుతామని రావిని బెదిరించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఈ బెదిరింపులను సీరియస్‌గా తీసుకున్నారు. రావిని బెదిరించిన వైసిపి నాయకుడిని నిలదీసేందుకు సిద్ధమయ్యారు. వైసిపి నాయకుడిని నిలదీసేందుకు రావి టెక్స్‌టైల్స్ వద్ద ఉన్న టిడిపి కార్యాలయం నుంచి వెళ్తున్నారు. ఆ సమయంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు అక్కడకి వచ్చారు. ఈ నేపథ్యంలో ఇరుపార్టీల కార్యకర్తలు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. పోలీసులు అక్కడికి చేరుకొని వారిని చెదరగొట్టారు.



వైసిపి శ్రేణుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ ఆందోళన చేపట్టిన టిడిపి కార్యకర్తలు

బెదిరింపులకు భయపడను : రావి

వైసిపి నాయకులకు బెదిరింపులకు భయపడేది లేదని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. రంగా వర్ధంతిని నిర్వహించి తీరతామని చెప్పారు. తప్పు వైసిపి నాయకులు చేస్తే పోలీసులు టిడిపి కార్యకర్తలపై లాఠీ ఛార్జి చేయడం దారుణమన్నారు.

తీవ్రంగా ఖండించిన లోకేష్, అచ్చెన్న

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గుడివాడలో టిడిపి కార్యకర్తలపై జరిగిన దాడిని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. 'గుడివాడలో గడ్డం గ్యాంగ్‌కి గుండు కొట్టించే రోజు అతి దగ్గర్లోనే ఉందని లోకేష్ పేర్కొన్నారు. అధికారపక్షం, రౌడీలు రాళ్లు వేసినా , భౌతిక దాడులకు దిగినా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం శోచనీయమన్నారు. సర్వేల్లో వైసిపి ఓడిపోతుందని తేలడంతోనే ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గూండాలను నమ్ముకుంటున్నాడని ఆయన ఆరోపించారు.

టిడిపి నేతలపై దాడులకు పాల్పడినవారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం నూజెండ్లలో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని కూల్చివేత ఘటనను, అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం దివిటివారిపల్లెలో టిడిపి నేత కొండ్రెడ్డి కాన్వాయ్‌పై వైసిపి నేతలు దాడిని కూడా లోకేష్ తీవ్రంగా ఖండించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-గుడిబండ (శ్రీ సత్యసాయి జిల్లా)

శ్రీ సత్యసాయి జిల్లా గుడిబండ మండలం కెఎస్ పల్లి గ్రామానికి చెందిన ఓ రైతు అప్పుల బాధతో శనివారం అర్ధరాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కెఎస్ పల్లి గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప (57)కు ఐదు ఎకరాల పొలం ఉంది. వేరుశనగ, మల్బరీ, మిరప తదితర పంటలు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మూడేళ్లుగా పంటలు సరిగా పండక నష్టాలు వచ్చాయి. పంటల పెట్టుబడికి, కుటుంబ పోషణకు బ్యాంకుల్లో, ప్రయివేటు వ్యక్తుల వద్ద దాదాపు రూ.8 లక్షల మేరకు అప్పు చేశారు. దీనికి తోడు కుమార్తె పెళ్లికుదిర్చారు. ఆమె పెళ్లి చేయలేక, అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. శనివారం అర్ధరాత్రి తన మల్బరీ షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య శారదమ్మ ఫిర్యాదు మేరకు గుడిబండ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'విద్యుత్' పథకాలపై ప్రజాభిప్రాయం : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ రంగంలో అమలవుతున్న సంక్షేమ పథకాల లోటుపాట్లను గుర్తించేందుకు విద్యుత్ సంస్థలు ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. విద్యుత్ శాఖ అధికారులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని తెలిపారు. విద్యుత్‌శాఖలో అన్ని శాఖలు సమన్వయంతో సంక్షేమ పథకాలను 100 శాతం విజయవంతం చేసేందుకు డివిజన్, జిల్లా, డిస్కం స్థాయిలో ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వీటి అమలులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా వివిధ స్థాయిల్లో మెరుగైన సమన్వయం ఉండేలా చేస్తున్నామన్నారు. విద్యుత్ రంగంలోని వివిధ కేటగిరీల వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చే సంక్షేమ కార్యక్రమాలు, విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని అన్నారు. ఇటీవల విద్యుత్ శాఖ అందుకున్న అవార్డులు బాధ్యతను పెంచాయని తెలిపారు. ప్రసార నష్టాలను సింగిల్ డిజిట్ 2.8 శాతానికి తగ్గించేందుకు (ట్రాన్స్) వివిధ చర్యలు అమలు చేసిందన్నారు. ఒక రోజు ముందు విద్యుత్ డిమాండ్ అంచనా వేసే మోడల్‌ను రూపొందించిందని తెలిపారు. తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్ కొనుగోళ్లు చేస్తూ ఇతర ఉత్తమ ప్రమాణాలను కూడా ట్రాన్స్‌కో అవలంభించిందని పేర్కొన్నారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు, అంచనాలను అందుకునేందుకు విద్యుత్ సంస్థలు నిరంతరం కృషి చేస్తాయని చెప్పారు.

ధాన్యం రైతుల దైన్యం

- అమ్మిన నెల రోజులకూ ఖాతాల్లో జమవ్వని నగదు
- ప్రభుత్వం రూ. 286.46 కోట్లు ధాన్యం కొనుగోలు
- రూ.19.40 కోట్లు మాత్రమే చెల్లింపులు



ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

- కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడుకు చెందిన ఎం.సాయిబాబు గత నెల 26న ఆర్‌బికె ద్వారా 75 కిలోల బస్తాలు 304 విక్రయించారు. రూ.4.62 లక్షలు ఖాతాలో జమ కావాల్సి ఉంది.
- ఉప్పులూరు గ్రామానికి చెందిన కౌలు రైతు నక్కుర్తి మల్లేశ్వరరావు గత నెల 24న 298 బస్తాల ధాన్యం ఆర్‌బికెలో విక్రయించారు. రూ.4.53 లక్షలు ఆయన ఖాతాలో జమ కావాల్సింది.

వీరిద్దరి ఖాతాల్లో ఇప్పటి వరకూ డబ్బులు పడలేదు. ఈ రైతులే కాదు జిల్లాలోని పలువురు రైతులు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

ధాన్యం అమ్మిన 21 రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినా వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సాంకేతిక లోపాలు సవరించి ఈ ఏడాది రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం ప్రకటించిన గడువులోపు నగదు చెల్లింపులు చేస్తామని జిల్లా అధికార జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ప్రకటించినా ధాన్యం డబ్బుల కోసం నెల రోజులకుపైగా రైతులు ఎదురు చూడాల్సి వస్తోంది. దీంతో, పంట పెట్టుబడులకు తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. కౌలు రైతులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉప్పులూరు గ్రామానికి చెందిన కౌలు రైతు నక్కుర్తి మల్లేశ్వరరావు భూ యజమానికి రూ.2,58,400 కౌలుగా చెల్లించాల్సి ఉంది. ధాన్యం డబ్బులు జమ కాకపోవడంతో అప్పులకు వడ్డీలు, కౌలు ఎలా చెల్లించాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ సీజన్‌లో బ్యాంకు రుణం లభించకపోవడంతో నాట్లు నుంచి నూర్పిడి వరకు పంట సాగు పెట్టుబడికి ఎకరానికి రూ. 30 వేలు చొప్పున ఎనిమిది ఎకరాలకు నెలకు నూటికి రూ.3 చొప్పున రూ.2.40 లక్షలు అప్పు చేశారు. నెలకు రూ.7,200 వడ్డీ పెరిగిపోతోందని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని ఆర్‌బికెల ద్వారా 1,40, 547 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం సేకరించింది. ఇందుకు గానూ 286.46 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.19.40 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమైంది.

కౌలు రైతులకు వడ్డీ భారం

జిల్లాలో మొత్తం 3.93 లక్షల ఎకరాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగైంది. 75 శాతం విస్తీర్ణంలో పంటను రెండు లక్షల మంది కౌలు రైతులు సాగు చేశారు. ఖరీఫ్ పంట రుణ ప్రణాళిక రూ. 3 వేల కోట్లలో పది శాతం రూ.300 కోట్లు కౌలు రైతులకు రుణాలు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఖరీఫ్ చివరి నాటికి 6,953 మంది కౌలు రైతులకు 22.41 కోట్లు మాత్రమే రుణాలు మంజూరు చేసింది. దీంతో, అత్యధికమంది కౌలు రైతులు వరి సాగుకు ఎకరానికి రూ.30 వేల వరకు ప్రయివేటు వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వచ్చింది. గత్యంతరంలేని పరిస్థితుల్లో నెలకు నూటికి రూ.3 నుంచి రూ.5 వరకూ వడ్డీకి అప్పు తీసుకున్నారు. ధాన్యం నగదును ప్రభుత్వం సకాలంలో జమ చేయకపోవడంతో అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని కౌలు రైతులు వాపోతున్నారు.

నిబంధనల సడలింపులో జాప్యం

తుపాను కారణంగా జిల్లాలోని 11 మండలాల్లో 26 వేల ఎకరాల్లో వరికి పంట నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక నివేదిక ప్రభుత్వానికి పంపారు. ప్రస్తుతం ఆ పంటను రైతులు ఇప్పుడిప్పుడే నూర్పిడి చేస్తున్నారు. తడిచిన వరి కంకులు రంగు మారడంతోపాటు నూకల శాతం ఎక్కువగా వస్తోందని రైతులు చెబుతున్నారు. నిర్దేశించిన ప్రమాణాలను సడలించి దెబ్బతిన్న ధాన్యం సేకరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి ఆదేశాలు రాకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

అప్పులపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- సిఎంకు యనమల సవాల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రోజుకో నిబంధన ఉల్లంఘిస్తూ, గంటకో అప్పు చేస్తూ అరగంటకో అబద్ధం ఆడుతూ రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం పాలన సాగిస్తోందని శాసనమండలిలో ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. అప్పులపై ముఖ్యమంత్రి, మంత్రులు రోజుకో విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం చేస్తున్న అప్పులపై కాగ్ అధికారుల సమక్షంలో ముఖ్యమంత్రితో బహిరంగ చర్చకు తాము సిద్ధమని ఆదివారం ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. గతంలో కంటే తక్కువ అప్పులు చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి మరోసారి అబద్ధ ప్రచారానికి తెరలేపారని విమర్శించారు. దేశంలోనే అత్యధిక అప్పులు చేసిన వ్యక్తిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. రాష్ట్రానికి చేసిన అభివృద్ధి, సంక్షేమం కంటే అప్పులు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయటంపైనే ఎక్కువ దృష్టిపెట్టారని విమర్శించారు. మూడున్నరేళ్లల్లో రూ.6.38 లక్షల కోట్లు అప్పు ప్రభుత్వం చేసిందని పేర్కొన్నారు. వీటికి అదనంగా ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేతనాలు, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు వేల కోట్లల్లో ఉంటాయని తెలిపారు. జగన్ ఐదేళ్ల పదవి కాలం పూర్తయ్యేనాటికి ఈ అప్పు రూ.11 లక్షల కోట్లకు పైగా చేరుతుందని పేర్కొన్నారు. టిడిపి హయాంలో చేసిన మొత్తం అప్పు రూ.1.63 లక్షల కోట్లు అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో లంచాలు తగ్గాయని సిఎం చెప్పటం పెద్ద జోక్‌గా చరిత్రలో నిలిచిపోతుందని విమర్శించారు. ప్రజల సంక్షేమం కోసం వినియోగించాల్సిన ప్రకృతి సహజ వనరులను తన దోపిడీ కోసం వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో 175 సీట్లు వస్తాయంటూ ముఖ్యమంత్రి పగటి కలలు కంటున్నారని, సింగిల్ డిజిట్‌కు పడిపోవడం ఖాయమని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి సస్యశ్యామలం చేస్తామని జలకథలు చెప్పిన జగన మూడున్నరేళ్లుగా ఎన్ని పూర్తిచేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని బిసి, ఎస్సి, ఎస్టి, మైనార్టీలు అత్యంత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.



ఏలూరు మీదుగా సాగిన పాదయాత్రల్లో పాల్గొన్న ఉద్యోగులు

ఏలూరు చేరుకున్న 'ఉక్కు పరిశ్రమ' పాదయాత్ర

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆ పరిశ్రమ ఉద్యోగులు విశాఖపట్నం నుంచి తిరుపతికి చేపట్టిన పాదయాత్ర ఆదివారం ఏలూరు చేరుకుంది. 'ఎవడ్రా అమ్మేది.. ఎవడ్రా కొనేది' అని నినదిస్తూ ఉద్యోగులు పాదయాత్ర సాగిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ మనసు మారేలా చేయాలని తిరుపతి వెంకటేశ్వరస్వామి వారిని వేడుకుంటూ ఈ పాదయాత్ర చేపట్టినట్లు స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు గంట్లా రామారావు, నరహరిశెట్టి విష్ణు, శయన బాబు తెలిపారు.

అమోస్ హంతకులను కఠినంగా శిక్షించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం అల్వాల గ్రామంలో ఇటీవల దళిత యువకుడు గాడిబండ ఆమోస్ హత్యకు గురికావడం పట్ల కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కులదురహంకారంతో ఆమోస్‌ను కిరాతకంగా చంపి నిప్పుపెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఓ నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి ఆదివారం ఎపి ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. గాడిబండ ఆమోస్ కులాంతర వివాహం చేసుకున్న ఎనిమిదేళ్ల తర్వాత కరుడుగట్టిన ఆధిపత్య కుల దురహంకారంతో కర్నూలు నగరంలోని శరీన్‌నగర్‌లో చంపి, నిప్పంటించారని పేర్కొన్నారు. అదే జిల్లాలో గురజాల గ్రామంలో ఫిజియోథెరపిస్ట్ బుడ్డన్న హత్య ఘటన మరవకముందే మరో ఘటన జరగడం దళితులను ఆందోళనకు గురిచేస్తోందని తెలిపారు. ఈ ఘటనపై ఎస్‌సి కమిషన్ సమగ్ర విచారణ కోసం గ్రామాన్ని సందర్శించి ఆమోస్ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు.

ఎల్గార్ కేసులో నిందితులందరినీ విడుదల చేయాలి..

భీమా కోరేగావ్‌లో 2018 జనవరి ఒకటో తేదీన చెలరేగిన హింసాకాండకు పూణేలోని ఎల్గార్ పరిషత్‌కు మధ్య ఎలాంటి సంబంధం లేదని పోలీస్ విచారణలో తేలినందున ఈ కేసులో నిందితులుగా ఉన్నవారందరినీ తక్షణమే విడుదల చేయాలని మరో ప్రకటనలో కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఏ తప్పు చేయకుండా జైలులో మగ్గుతున్న భీమా కోరేగావ్ రాజకీయ ఖైదీలను తక్షణం విడుదల చేయాలని కోరారు.

'రియల్ ఎస్టేట్' సమస్యలపై ప్రభుత్వ దృష్టి

- క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ముగింపు కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రియల్ ఎస్టేట్ రంగంలోని సమస్యలను త్వరలో ప్రభుత్వం పరిష్కరించనుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. విశాఖ నగరంలోని ఎంవిపి కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో మూడ్రోజులపాటు జరిగిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ఆదివారంతో ముగిసింది. చివరి రోజు స్థిరాస్తుల కొనుగోలు కోసం జనం భారీగా తరలివచ్చారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి అమర్‌నాథ్ హాజరై మాట్లాడారు. విశాఖపట్నం పారిశ్రామిక, ఐటి హబ్‌గా రూపుదిద్దుకోబోతోందని, ఇన్ఫోసిస్, అమెజాన్, ఐబిఎం వంటి దిగ్గజ కంపెనీలు తమ కార్యకలాపాలను త్వరలో ఇక్కడ ప్రారంభించనున్నాయని తెలిపారు. మార్చిలో హెల్త్ సమ్మిట్, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ జరుగనున్నాయన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి కలిసి సాగనుందన్నారు. క్రెడాయ్ వైజాగ్ రాష్ట్రానికే బ్రాండ్ ఇమేజ్‌గా నిలుస్తోందని అన్నారు. విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ మాట్లాడుతూ క్రెడాయ్ విశాఖపట్నంతో తన సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అసోసియేషన్ సభ్యులు అన్ని నియమాలకూ కట్టుబడి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాధవ్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, క్రెడాయ్ వైజాగ్ ఛైర్మన్ బి.శ్రీనివాసరావు, అధ్యక్షులు కెఎస్ఆర్‌కె.రాజు (సాయి), గౌరవ కార్యదర్శి ఇ.అశోక్ కుమార్, ఎక్స్‌పో కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. చివరి రోజు ఎక్స్‌పోను సందర్శించిన వారిలో టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, వైసిపి నాయకులు జి వెంకటేశ్వరరావు ఉన్నారు. ఎక్స్‌పోలో విశాఖ నగరానికి చెందిన సుమారు 80 రియల్ ఎస్టేట్ సంస్థలు పాల్గొని తమ ప్రాపర్టీలను ప్రదర్శనకు ఉంచాయి. రూ.70 కోట్ల నుంచి రూ. వంద కోట్ల వ్యాపారం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

ఆయిల్‌పామ్ మొక్కలు ఇచ్చేది ఎప్పుడు?

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని, రైతులకు మొక్కలు అందించేందుకు అన్ని చర్యలూ చేపట్టామని ప్రభుత్వం చేసి ప్రకటనకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు ఏ మాత్రమూ పొంతన లేకుండా ఉంది. మొక్కల కోసం రైతులు ఎదురు చూడాల్సి వస్తోంది. ఏలూరు జిల్లాలో 28 మండలాలు ఉండగా, వాటిలోని 22 మండలాల్లో 1.20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. ఈ పంట సాగు మరింత పెంచనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు సైతం మొగ్గుచూపుతున్నారు. అయితే, వారికి అవసరమైన మొక్కలను ప్రభుత్వం ఇవ్వడం లేదు. జిల్లాలో కొత్తగా 11,250 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఎకరానికి 55 నుంచి 60 మొక్కలు అవసరం అవుతాయి. వీటి కోసం రైతు భరోసా కేంద్రాలకు, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు విత్తనాలు తెచ్చి నారు తయారు చేసి ఆ మొక్కలను రైతులకు అందించాల్సి ఉంది. మొక్క ఖరీదు రూ.194గా నిర్ణయించారు. రైతులు డబ్బు చెల్లించి కంపెనీలకు దరఖాస్తు చేసుకున్నారు. తయారైన మొక్కలను కంపెనీలు తమకు విక్రయించడం లేదని రైతులు చెప్తున్నారు. బ్లాక్ మార్కెట్లో మొక్క రూ.400కు విక్రయిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. కంపెనీల నుంచి దళారులు కొనుగోలు చేసి తమకు రూ.600 నుంచి రూ.700కు విక్రయిస్తున్నారని, దీంతో, ఆర్థిక భారమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్‌పామ్ మొక్కలు ఇవ్వాలని అధికారుల, కంపెనీల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఆయిల్‌పామ్ మొక్కలు కావాలని దరఖాస్తు చేసిన రైతులు ఆయా భూముల్లో వేరే పంటలు వేయకూడదని నిబంధన పెట్టారు. దీంతో, మొక్కజొన్న వంటి పంటలు వేయకుండా భూములను ఖాళీగా ఉంచారు. ఇటు మొక్కలు అందక, అటు నింబంధనల వల్ల వేరే పంట సాగుకు అవకాశం లేక రైతులు నష్టపోతున్నారు. భూములు ఖాళీగా వదిలేయడంతో ఎకరాకు రూ.35 వేలకుపైగా నష్టపోయారు. ఆయిల్‌పామ్ మొక్కలు రైతులకు అందించడంలో ముఖ్య భూమిక పోషించాల్సిన జిల్లా ఉద్యాన శాఖాధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంపెనీ యాజమాన్యాలు తమమాట వినడం లేదని మాట దాటవేస్తున్నారు. ఇటీవల చింతలపూడిలో మొక్కల కోసం రైతులు అధికారులను నిలదీయగా కంపెనీ ప్రతినిధులతో సమావేశమై చర్చించినా ఫలితం లేకుండాపోయింది. తమకు కావాల్సిన ఒకరిద్దరికి మొక్కలు ఇచ్చి మమ అనిపించారు. దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ వరుస క్రమంలో కంపెనీలు మొక్కలు ఇవ్వాల్సి ఉంది. కట్టిన డబ్బులను ఏడెనిమిది నెలల తర్వాత తిరిగిచ్చేస్తున్నాయి. జనవరి నెలాఖరుకు మొక్కలు అందించనున్నట్లు ఇటీవల జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఉద్యాన శాఖ అధికారులు చెప్పినా రైతులు మాత్రం విశ్వసించడం లేదు. దాదాపు రెండేళ్ల నుంచి ఇదే చెబుతూ తమను మోసగిస్తున్నారని వాపోతున్నారు. ఆయిల్‌పామ్ మొక్కలు త్వరితగతిన అందించాలని కోరుతున్నారు.



ఆయిల్‌పామ్ తోట

ఇబ్బందికి గురిచేయడం దారుణం

ఆయిల్‌పామ్ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నా మొక్కలు అందించడంలో ఉద్యాన శాఖ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. బ్లాక్ మార్కెట్లో మొక్కల అమ్మకం సాగుతోంది. దీన్ని అరికట్టి దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ వెంటనే మొక్కలు అందించాలి. ఇక్కడ అందుబాటులో లేకపోతే ఇతర ప్రాంతాల నుంచి తెప్పించాలి. మొక్కలు అందించకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతాం.


-కె.శ్రీనివాస్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti



" ప్రపంచం మనం ఊహించినంత వినోదభరితంగా లేదని నేను మీకు హామీ ఇస్తున్నాను. అందుకనే వాస్తవ ప్రపంచం గురించి రాయండి."

– పియరీ చోడెర్లోస్ డి లాక్లోస్

చివరి అంకం దగ్గర

ఏ అక్షరమైతే తలెత్తుకుని దిటవుగా నిలబడమని
తరగతి గదిలో ప్రబోధించిందో
ఆ అక్షరం ఆత్మహత్య గావించుకుంటుంది
వెలిగి పదిమందిని వెలిగించాల్సిన దీపం
కడగొట్టు యాతనలో ఉక్కిరిబిక్కిరి అవుతుంది

పెట్టుబడి దేవుడు ఇప్పుడు తరగతి గదుల్లోకి
ప్రవేశించడం తిరోగమన పురోగతి
ముక్కలు ముక్కలుగా నరికి విచ్ఛిన్నం చేస్తేగాని
శాంతించడు
వాడి సాంకేతికత స్థాపన ప్రక్రియలో నిండా
మునిగి సొంగలు కార్చడమే మన తక్షణ కర్తవ్యం!

భావప్రసార వంతెన కూలే పన్నాగంలో
నువ్వూ నేనూ పావులం
అమాయకత్వమో
తెలివిమీరినతనమో ... ఇంకేదో
చరిత్ర మాత్రం క్షమించదు!
తెలిసో తెలియకుండానో విధ్వంసం వలలో
చిక్కుబడిపోతేపోయేం
నల్లబల్ల చాటున మగ్గిపోతున్న అక్షరాలను
వెలిగించే కాగడాలనే వొదిలేసాం
వాస్తవం కళ్లముందుకొచ్చే సమయానికి
చేతులు కాలేక ఆకులు ముట్టుకుందామంటే
కుదరదు

ఏ స్వరం వూదితే ఆ స్వరానికి గంగిరెద్దుల్లా
తలలూపుతున్నాం తప్ప
వాడైన కొమ్ములతో వాడి పొట్టను చీల్చే
లోచూపునే మరిచిపోయాం
కడుపునిండా సంతృప్తిగా తిని సుఖం తేన్పు తీసి
ముందే అనుకున్న ప్రణాళికను మన మెదళ్లలోకి
ఎక్కించడానికి వాడు కుతంత్రం పన్నాడు

కుతంత్రమేదో స్వతంత్రమేదో గుర్తించడం మానేసి
చాన్నాళ్లయింది మనకు
మధ్య తరగతి సుఖం ఉయ్యాల్లో దొర్లడమే
హాయిగా వున్నట్టుంది

గొయ్యిని వాడే తీస్తాడు
గోతులోకీ వాడే తోస్తాడు
పూడ్చిపెట్టడమే చివరి అంకం
అప్పుడు మనతోపాటే బోరున ఏడ్వడానికి
నల్లబల్ల వుండదు
ఓదార్పునివ్వడానికి సుద్దముక్కలు
మొహం చాటేస్తాయి
అరచేతుల్లో కుదురుగా వొదిగి అమిరిన పుస్తకం
అనాథ బేలచూపులు చూస్తుంది
ఏడున్నర ఇంచీల తెర
విరగబడి విరగబడి నవ్వుతుంది
ఎందరెందరో తలరాతల్ని మార్చిన క్రాంతదర్శి
వాడనుకుంటున్న చివరి అంకం ఇంకా పూర్తవలేదు
యుద్ధ వాతావరణం సన్నద్ధంగానే వుంది!

(బైజూస్ యాప్‌ని వ్యతిరేకిస్తూ..)

– చంపావతి

మనుషులు చేసిన దేవుళ్ళు

ఇప్పుడు మనిషి ఒక్కడే
దేవుళ్లే అనేకం
కులానికి ఒక దేవుడు
మతానికి మరో దేవుడు
వర్గానికి ఇంకో దేవుడు

ఆకలి కడుపుతో
మనిషి సతమతమౌతుంటే
మొదటి నైవేద్యం దేవుడికి
చింపిరి బట్టలు మనిషివైతే
పట్టువస్త్రాలు దేవ దేవునికి
కళ్ళముందున్న ఆకలి తీరదు
గర్భగుడిలో కదలలేని దేవునికి మాత్రం
అంగ రంగ వైభోగాలు!

మన చుట్టూ ఎందరో అభాగ్యులున్నా
సాయం చేసే చేతులు సున్నా
పాప భీతితో మాత్రం
దేవుని హుండీకి చేరే నజరానా
గుడిమెట్లపైనే ఆకలి చూపుల హైరానా

హుండీలో నక్కిన నోటు
చేరునా ఆకలి కడుపుల వరకూ
మనష్యుల్ని మరచిన మనసులకు
మనుషులు చేసిన దేవుళ్ళకే అగ్ర తాంబూలం
సిగ్గుచేటు..!

– మహబూబ్ బాషా చిల్లెం
9502000415

ద్వంద్వ సంస్కృతి

నాకు ఉగాది అంటే ఇష్టం
పరాయి కొత్త సంవత్సరమంటే
పరమ అసహ్యం..
తాగి ఊగిపోవడమంటేనే
అరికాలిమంట నెత్తికెక్కుతుంది
కారణం ఆ రోజు తప్ప మావాళ్ళు
మద్యం వాసన కూడా చూడరు
అందుకే ప్రచారం మొదలెడతాను
మనది కాదు ఈ సంస్కృతి
జనవరి ఒకటే విష సంస్కృతి అని ...

పేజీలు తిప్పేస్తున్న కేలండర్
ఎవరిదని మాత్రం అడగను
ఉగాది తెలుగు వారిదే
ఆంగ్లం బతకడానికే అంటాను
తెలుగును చంపేసి
ఉగాదిని, సంస్కృతిని బతికిస్తాను ..!

గుండెలనిండా ప్రాణవాయువులా
పరాయి భాషను శ్వాసిస్తాను
ఏడాదికోసారి కొత్త వత్సరాన్ని ద్వేషిస్తాను
మన భాషను పండుగల్ని
పరిరక్షించేందుకే మా పిల్లల్ని
విదేశాల విమానాలెక్కిస్తాను
డాలర్ కలలు కంటూనే
డాంబికాల డామినేషన్ మొదలెడతాను
తెలుగును అంపశయ్యపై పడుకోబెట్టి
ఆంగ్ల సంవత్సరాదిని అడ్డంగా నరికేస్తానని
ఆత్మాభిమాన ప్రదర్శనలిచ్చేస్తాను.!

అన్నీ పరాయివి అనుభవిస్తూనే
ఆంగ్ల సంవత్సరాది మీద
ఆత్మవంచన ప్రచారం మొదలెడతాను!
పరాయి భాషతో పాటు
వారి జాడ్యాలూ వస్తాయనే నిజం దాచి
ఆంగ్ల వత్సరం మీద అగ్ని వర్షమై కురుస్తాను
జనవరి రెండోతేదీ నుండి అన్నీ మరచి
పరాయి గాఢ పరిష్వంగంలో మత్తుగా జోగుతాను!


– వెన్నెల సత్యం
94400 32210

బహుముఖ సృజనకారుడు అంట్యాకుల

సందర్భం

ప్రఖ్యాత చిత్రకారుడు అంట్యాకుల పైడిరాజు తెలుగు నేలకు ఒక రంగుల వన్నె. ఆయన 1919 నవంబర్ 14వ తేదీన అప్పటి శ్రీకాకుళం జిల్లా బొబ్బిలిలో జన్మించారు. తండ్రి రాజయ్య దాసు, తల్లి నరసమ్మ. రాజయ్య దాసు తత్వాలను రాసేవారు. కొన్నాళ్లు పెద నాన్న వద్ద ఖరగ్‌పూర్‌లో చదువుకున్న పైడిరాజు ... స్కూలు నుంచి రాగానే, చిత్రకళ నేర్చుకుంటున్న పెదనాన్న గారి చిత్రాలను పూర్తి చేసేవాడు. అది గమనించిన పెదనాన్న ... పైడిరాజును కూడా తనతో పాటు చిత్రకళా గురువు వద్దకు తీసుకు వెళ్లేవాడు. అలా చిన్ననాడే పైడిరాజుకు చిత్రకళ పట్ల ఆసక్తి, అభినివేశం ఏర్పడ్డాయి. తరువాత 1935లో విజయనగరం వచ్చి, మహారాజా ఉన్నత పాఠశాలలో ఉన్నత విద్య అభ్యసించాడు. చిత్రకళ సాధన కొనసాగించారు. పూసపాటి లక్ష్మీనరసింహరాజు ఆయన్ని 1940లో మద్రాసులోని 'స్కూల్ ఆఫ్ ఆర్ట్స్'లో చేరేందుకు ప్రోత్సహించారు. సంగీత కార్యక్రమాల్లో పాడుతూ, తబలా వాయిస్తూ, వచ్చిన కొద్దిపాటి పైకంతో జీవిస్తూ... చిత్రకళను అభ్యసించాడు. దేవీప్రసాద్ రాయచౌదరి శిక్షణలో ఆరేళ్ల కోర్సును నాలుగేళ్లలో పూర్తి చేసి, 1944లో ప్రథమ శ్రేణి డిప్లమో పొందారు. తరువాత తన సాధనకు విజయనగరాన్నే స్థానంగా ఎంచుకున్నారు.

రెండో ప్రపంచ యుద్ధ సమయంఒ పైడిరాజు తన కళ ద్వారా ప్రజలను చైతన్య పరచడానికి విశాఖపట్నం, శ్రీకాకుళం, కాశీబుగ్గ మొదలైన ప్రాంతాలను పర్యటించారు. దుర్భర దారిద్ర్యంతో అల్లాడే పేదల జీవన దృశ్యాలు అనేకం చిత్రించారు. అప్పట్లో ప్రజాశక్తిలో ప్రచురించిన ఉత్తరాంధ్ర కరువు దృశ్యం ఇప్పుడొక చారిత్రక సాక్ష్యం. అప్పట్లో విజయనగరంలోగల రోణంకి అప్పలస్వామి, చాగంటి సోమయాజులు, శ్రీరంగం నారాయణబాబు వంటి సాహిత్య వేత్తలతో పరిచయాలు ఏర్పడ్డాయి. 1948లో మెయిన్ రోడ్డులోని రాతి మేడలో ఉంటూ విద్యార్థులకు చిత్రకళా పాఠాలు మొదలుపెట్టారు. 1950 నాటికి ఒక చిత్రకళ పాఠశాలను నిలబెట్టుకున్నారు. 1952లో దానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపునిచ్చింది. పి.వి.జి రాజు తమ కోటలోని చిత్ర కళాశాల నడపడానికి అనుమతించి, పేద విద్యార్థులకు ఉచిత భోజన వసతి సౌకర్యాలను కూడా కల్పించారు. అక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు తరువాతి కాలంలో చిత్రకళోపాధ్యాయులుగా, ప్రఖ్యాత చిత్రకారులుగా స్థిరపడ్డారు.



మహారాజ కళాశాల ప్రిన్సిపల్ ఎ.ఎల్ నారాయణ సూచన మేరకు – ఆ కళాశాల విద్యార్థుల్ని మద్రాసు, అజంతా, ఎల్లోరా, బొంబాయి, కలకత్తా, బోల్పూరు (శాంతినికేతన్) తదితర పట్టణాలకు తీసుకెళ్లి, ఆయా ప్రాంతాల కళల్లో ఉన్న వైవిధ్యతలను బోధించారు. అప్పుడే ప్రముఖ ఆంగ్ల పాత్రికేయులు ఎ.ఎస్ రామన్‌ని, బోల్పూరులో నందలాల్ బోసునూ కలుసుకున్నారు. అంట్యాకుల 1961లో ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ సభ్యుడయ్యారు. 1972–77 కాలంలో ఉపాధ్యక్షులుగా ఉన్నారు. 1962లో విశాఖపట్నంలో చిత్రకళా పరిషత్తును స్థాపించారు. 1975లో ప్రపంచ తెలుగు మహాసభ వీరిని ఘనంగా సత్కరించింది. ప్రభుత్వమిచ్చే కొద్దిపాటి సహాయంతోనే పైడి రాజు సుమారు 26 ఏళ్లు స్కూలు నడిపారు. 1977లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'ఫైన్ ఆర్ట్స్' ప్రారంభించడంతో అప్పటి వైస్ ఛాన్సలర్ ఎం.ఆర్ అప్పారావు పిలుపు మేరకు చిత్రకళోపన్యాసకులుగా చిత్రకారుడు లక్ష్మయ్య గారితో కలిసి పనిచేశారు.

జానపద శైలిలో చిత్రాలను చిత్రించడంలో అంట్యాకుల తనకు తానే సాటి. మూర్తి చిత్రాలు, తైలవర్ణ చిత్రాలు, నీటిరంగు చిత్రాలు, రేఖా చిత్రాలు అద్భుతంగా గీసేవారు. కాంస్య, ఇతర లోహ శిల్పాలు చెక్కే నైపుణ్యం కూడా వీరికి ఉంది. కళింగాంధ్ర గ్రామీణ సంస్కృతి, కట్టూబొట్టూ, ఆభరణాలు, అలంకారాలు ఆయన చిత్రాల్లో కనిపిస్తాయి. వీరి చిత్రాలు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీలోనూ, సాలార్జంగ్, త్రివేండ్రం, కలకత్తా బిర్లా మ్యూజియంలలోనూ, న్యూఢిల్లీలోనూ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలోనూ ఉన్నాయి. రష్యా, కాబూల్, చైనా, అమెరికా, జర్మనీ, మలేషియా వంటి అనేక దేశాల్లో వీరి చిత్రాలు గ్యాలరీల్లో అలంకరించబడ్డాయి. 'తిలకం' అనే వర్ణ చిత్రానికి పంజాబ్ ప్రభుత్వం బంగారు పతకం బహుకరించింది. 'భగ్నవీణ, ఊరేగింపు' చిత్రాలకు విశాఖపట్నం ఎగ్జిబిషన్లో అవార్డు, బంగారు పతకం లభించాయి. 'తెగిన తీగ, పేరంటం, తూర్పు రబోత, నావికులు, ఆకలి, అలంకరణ, సంతకు, పల్లెటూరు దృశ్యం' మొదలైనవి వీరి పేరెన్నికగన్న చిత్రాల్లో కొన్ని. 'స్నానానంతరం, నవ్యమార్గం' అనే రెండు చిత్రాలు కాబుల్, కైరో లలో జరిగిన ప్రదర్శనలలో విక్రయించబడ్డాయి. పలు చిత్రాలు ప్రముఖ ఆంధ్ర, ఆంగ్ల పత్రికల్లో అచ్చయ్యాయి. విశాఖపట్నం మెయిన్ రోడ్డు మీద, ఆర్టీసీ కాంప్లెక్స్ దరిలోనూ చేసిన గురజాడ అప్పారావు, అల్లూరి సీతారామరాజు, జవహర్లాల్ నెహ్రూ, రుద్రమదేవి కాంస్య విగ్రహాలు వీరి ప్రతిభకు గీటురాళ్లుగా కనబడతాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనను కళాప్రపూర్ణ, గౌరవ డాక్టరేట్ బిరుదులతో సత్కరించింది. వీరి పెద్ద కుమారుడు రాజేశ్వరరావు హైదరాబాదులో, రెండో కుమారుడు నాగేష్ విశాఖపట్నంలో చిత్రకారులుగా స్థిరపడ్డారు. పైడిరాజు విద్యార్థి దశలో మద్రాసులో సంగీత కచేరీలు చేశారు. నాటకాల్లో చిన్నచిన్న వేషాలు వేశారు. కొన్ని కవితలు రాసి 1976లో 'అక్షర శిల్పాలు' సంపుటిగా ప్రచురించారు. 1990లో 'అక్షర చిత్రాలు, కథలు–వ్యాసాలు' అనే చిన్న కథా పుస్తకం వెలువరించారు.

ఆయన సాహిత్యరంగ ప్రవేశం ఆసక్తికర విషయం. రోణంకి అప్పలస్వామి, ఆరుద్ర, శ్రీశ్రీ, నారాయణ బాబు, చాసో గార్లతో పరిచయమున్న రోజుల్లో రచనా వ్యాసంగం పట్ల దృష్టి సారించలేదు. 1972లో ఆరుద్ర, అనిశెట్టి, దాశరథి, సోమసుందర్ గార్ల పిలుపు మేరకు నేను (సీరపాణి) అప్పటికి విజయనగరం సంస్కృత కళాశాల విద్యార్థిగా ఉన్నప్పటికీ, చాసో గారితో పాటు ఆంధ్ర 'అభ్యుదయ రచయితల సంఘం' పునర్నిర్మాణం చేశాం.. విజయనగరం శాఖకు చాసో అధ్యక్షులుగా, నేను ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు– పైడిరాజు కార్యవర్గ సభ్యులు. ఇంకా పి.ఎల్.పి రాజు, పెనుమత్స అప్పలరాజు, దంతులూరి రామరాజు, బులుసు జీప్రకాష్ కార్యవర్గ సభ్యులు. ఎ.బి సుబ్బారావు, యు.ఎ నరసింహమూర్తి, ద్వారం దుర్గాప్రసాదరావు, అరుణ కిరణ్, ఎన్.వి రమణారావు మొదలైన రచయితలు పాల్గొనేవారు. అరసం సమావేశాలు పైడిరాజు గారి ఆర్ట్ గ్యాలరీలోనే జరిగేవి. అరసంకు ఒక ఎంబ్లెమ్ కూడా ఆయన వేశారు. సాహిత్య కార్యక్రమాలకు గురజాడ, గిడుగు, కందుకూరి వంటి సాహితీమూర్తుల రేఖాచిత్రాలు రూపొందించేవారు. సాహిత్య చర్చలన్నింటినీ ఓపికగా వినేవారు. ఇలాంటి వాతావరణంలో ఆయనకు కవిత్వం రాయాలనే కుతూహలం కలిగింది. 55 ఏళ్ల వయసు పైబడిన తర్వాత రచనా వ్యాసంగం ప్రారంభించారు. 1998 డిసెంబర్ 26న తన 78వ ఏట కన్నుమూశారు. తన రేఖా కథా చిత్రాలతో, శిల్పాలతో సజీవమూర్తిగా కనిపించే అంట్యాకుల పైడిరాజు నిజమైన ప్రజాపక్ష చిత్రకారుడు. బహుముఖీన సృజనకారుడు. ఆయనకు నివాళి.

(డిసెంబర్ 26 : అంట్యాకుల పైడిరాజు వర్ధంతి)

– సీరపాణి
87902 32565

ఎంపిక

గొప్పగా చప్పుడు చేసేనని
ఎండుటాకుల్ని ఎప్పుడూ నమ్మకు

నువ్వు జారిపడినప్పుడు
అవి జాలి కూడా చూపవు
రెప్పపాటులో జారుకుంటాయి
పక్కకి చల్లగా తప్పుకుంటాయి

నిన్ను గమనించక, తలదించి ఉండేనని
విరిబాలలపై నెపుడూ విసుగు చెందకు
ఉపేక్షించేనని దిగులు పడకు
ప్రతి మలుపులోనూ
పరిమళమై వెన్నంటి ఉంటాయి.
నీ యాత్రను ప్రేమభరితం చేస్తాయి.

– డా.డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ,
94408 36931

నేలమీది నెలవంకలు

వాళ్లని ఏమని వర్ణించాలి?
క్రమశిక్షణ నేర్చిన కుందేళ్లు!
నేల మీద నడయాడే నెలవంకలు
ఎవరైతే నేమి?
వాళ్ల దయా దీపాలు
కరుణార్ద్ర పాదాల దేవదూతలు
ప్రేమ సదస్సులు సహన
సరస్సులు
చీమలు నేర్పిన క్రమశిక్షణ ఏమో!
ఒకరి తర్వాత ఒకరు
బాధ్యతను భద్రంగా పట్టుకొని
మౌనాన్ని ఇంద్రధనస్సుల
చిరునవ్వుగా
అలంకరించుకొని
అలా గదిలోకి నడిచొస్తారా!
ఓ లేలేత గాలి
మంత్రమేదో వేసినట్టు
వారి మీదుగా నన్ను తాకి
సేద తీరుస్తుంది!
వాళ్ల వెనుక ఎన్ని
సుడిగుండాలన్నా
మృదు లేపనమేదో పూసుకుని
నాజూకు హంసల్లా..
కలగా.. కాలంగా నడిచొస్తారు
వారిని చూడగానే
ఏ మంత్రం వేస్తారో
నా లోలోపలి భయాలు
ఇట్టే పారిపోతాయి!
సూది దూది కన్నా మెత్తగా
దిగుతుంది నా దేహంలోకి –
లోని ముందు చుర చుర కుట్టినా
లోలోపలి బాధ మాత్రం
మెల్లిగా జారుకుంటుంది!
వారి సేవే నిజమైన ఔషధమని
నన్ను పెనవేసుకున్న హాయి
నిర్ధారిస్తుంది!
నిద్ర తలుపులు తెరిచి
ఒకానొక ప్రశాంతతేదో..
నన్ను స్వప్నలోకాలకు
ఆహ్వానిస్తుంది
ప్రాణ దూతలై
ఊపిరి శిక్షణాలను మోసుకొచ్చి
ఈ కాలానికి బహుకరించే
వినీత మనస్కులు
వినమ్రమూర్తులు
వారు కదూ,
అసలైన దివ్య ధాత్రీదీప్తులు!

శిఖా – ఆకాష్
93815 22247



చదవాల్సిన కథలు 'షేమ్..షేమ్.'

రెండు కవితా సంకలనాలతో శక్తిమంతుడైన కవిగా గుర్తింపు తెచ్చుకున్న దేశరాజు రెండవ కథా సంకలనం 'షేమ్..షేమ్.. పప్పీ షేమ్!'. బ్రేకింగ్ న్యూస్ పాఠకురాలిగా దేశరాజు కథా కౌశలం గురించి తెలుసు. కవిత్వం అంత పదునుగా కథ చెప్పడం కష్టం. కవిత్వం తాకినంత సూటిగా హృదయాన్ని కథ తాకడం కష్టం. అయితే రెండు ప్రక్రియల్లోనూ నైపుణ్యం సాధించినవారు లేకపోలేదు. అలా కవిగా కథకుడిగా తనకొక స్థానాన్ని దేశరాజు సాధించగలడని అతను ఎన్నుకున్న వస్తువులు, చూసే చూపు తెలుపుతున్నాయి. ఈ కథల్లో నాస్టాల్జియా పలవరింత, అప్పుడదొక స్వర్గం అనే కాలయంత్ర ప్రయాణం, ఆదర్శాల ఆకాశయానం, గంభీర వుపన్యాసాల వరదా లేవు. ఇది వర్తమాన సమాజ చిత్రపటం. రచయిత తరపున, మనం ఎలా వుండాలో చెప్పే తీర్పులూ వుంటూన్న పరిస్థితిపై ఘాటు విమర్శలు లేవు. "ఇలా వున్నాం కనుక ఎలా వుండాలో తేల్చుకోండి" అని పాఠకుల వివేకాన్ని గౌరవిస్తాడు. అది మంచి లక్షణం.

వ్యక్తిత్వ నిర్మాణకాలంలో ఏర్పడి నిలిచిపోయిన ఆదర్శ చట్రంలో ఇమిడి వుండడం వల్ల సమాజానికి చేయగల మేలు, కాలం తెచ్చిన మార్పులకు అనుగుణంగా జీవించడం వల్ల ఏమాత్రం చెయ్యలేమా? మధ్యేమార్గం లేదా? ఎవరి మటుకు వారు తమ తమ సుఖసౌధాలకు అలవాటు పడినప్పుడు సమాజాన్ని పట్టించుకునేదెవరు? మనమటుకు మనం మన సిద్ధాంతాలను అనుసరించే జీవనశైలి ఏర్పరుచుకుని బతికినంత మాత్రాన సమాజానికి వొరిగేది ఏమిటి? మన ఆచరణ కనీసం కొందరికైనా మార్గదర్శకం కావాలి కానీ మనని చూసి మెచ్చుకుంటే చాలా? లేదా మనకి మనం నిజాయితీగా వున్నామనే ఆత్మ సంతృప్తి చాలా? మారిన ప్రపంచ స్థితిగతుల వేగానికి కొట్టుకు పోకుండా నిలబడగల స్థిమితం ఎంతమందికి సాధ్యం? అరచేతిలోకొచ్చిన సాంకేతిక సౌకర్యాలు జీవిత గమనాన్ని సులభతరం చెయ్యడంతోపాటు అనేక చాపల్యాలకు దారితియ్యడాన్ని నిలువరించడం సాధ్యమా?

ఇంటిపని స్త్రీలదే అనే సంప్రదాయం ఇంకా చెల్లుబడి అవుతూ వుండగా, 'ఉద్యోగం పురుష లక్షణం' అనే నానుడిని ఆర్థిక స్థితి గతులు , స్త్రీల స్వాతంత్ర్య ఆకాంక్ష కలసి 'ఉద్యోగం మనిషి అవసరం'గా మార్చాయి. అయితే మనుషులందరికీ ఇంటా బయటా కనీస సౌకర్యాలు సమానంగా లేవు. ఇంట్లో శ్రమ విభజన సమానంగా లేదు. ఈ విషయాన్ని అర్థం చేసుకుని సహచరితో పని పంచుకునే పురుషులను ఎగతాళి చెయ్యడం విషయంలో స్త్రీలు కూడా మారకపోవడం ఆశ్చర్యం. వయోభేదం లేకుండా స్త్రీలపై హత్యాచారాలు, ఆ విషయంలో సమాజం చేసే విక్టిమ్ బ్లేమింగ్ మనకి కొత్త కావు. ఈ భయానక బీభత్స స్థితిలో స్త్రీలే తమను తాము నిలబెట్టుకోడానికి సాంకేతికను ఉపయోగించుకోడం నేర్చుకోడమే కాదు, మగపిల్లల పెంపకంలో మార్పు రావాలి. ఇదంతా జరగాలంటే కుటుంబ సభ్యుల మధ్య సంభాషణకి సమయం వుండాలి. అది వుండాలంటే బతుకులో స్థిమితం వుండాలి. అది వుండాలంటే ఆర్థిక వెసులుబాటు వుండాలి. ఈ నిచ్చెనమెట్ల వ్యవస్థలో ఇది ఎలా సాధ్యం? ఎప్పటికి సాధ్యం? ఎవరి వలన సాధ్యం?


అన్నీ అమరిన అరచేతిలోకి వయసుతో సంబంధం లేకుండా సౌకర్యాలతో పాటు చాపల్యాలు కూడా తెస్తున్న సంకేతిక పరిజ్ఞానిదా తప్పు? దాన్ని సరిగ్గా ఉపయోగించుకోలేని మూర్ఖ మానవులదా? యువతతో ఆడుకుంటున్న స్వార్థపరులదా? గంభీరమైన విషయాలతో పాటు హాస్యంతో కూడిన అవాస్తవ కథలు రెండింటితో పద్దెనిమిది కథల ఈ కదంబం సరళమైన శైలిలో వుండి చదివిస్తుంది, ఆలోచించమంటుంది.

– పి.సత్యవతి

వికటిత జీవితాల హృదయ పరిమళం



మధురాంతకం నరేంద్ర



"నీ జీవితానికేం వడ్డించిన విస్తరి" అని అన్నీ పెట్టి పుట్టినవారి గురించి అంటూంటారు. వారి ప్రభవానికి, ప్రాభవానికి లోటు ఉండదు. తండ్రి ఓ మేరునగధీరుడు. కానీ అలా అన్నీ ఉన్నచోట జననం పొందటం మహా భాగ్యమే ఐనా బంధువులు, మిత్రులు, సమాజం వారిని ఓ కంట కనిపెడుతూనే ఉంటారు. పైకి కనిపించినంతగా వారి జీవితం నల్లేరు మీద నడకలా ఉండదు. వేసే ప్రతి అడుగుని నిశితంగా గమనిస్తుంటారు జనం. తండ్రి పేరు నిలబెట్టాలన్న తపన ఒక పక్క. కనీసం దాన్ని చెడగొట్టకుంటే చాలునన్న జాగ్రత్త ఒక పక్క. తండ్రి గొప్ప పండితుడైతే లాభాలతో పాటు కొన్ని కష్టాలూ ఉంటాయి. వాటినుండి గట్టెక్కి తానేమో నిరూపించుకున్న వారు చాలా కొంతమందే ఉంటారు. అలాంటి వారిలో ఒకరు మధురాంతకం నరేంద్ర. ఆధునిక సీమ కథకుల్లో ఒకరైన మధురాంతకం రాజారాం కుమారుడిగా తన సాహిత్య జీవితాన్ని ప్రారంభించడం సులభమే కావచ్చు. కానీ దాన్ని కొనసాగించడం, అందులో నిలదొక్కుకోగలగడం, పేరు తెచ్చుకోవడం కత్తిమీద సామే! ఐతే దాన్ని ఆయన దిగ్విజయంగా సాధించారు. తన ప్రత్యేక రచనా వరబడితో భళా అనిపించుకున్నారు నరేంద్ర. ఆయన నవల మనోధర్మపరాగం సాహిత్య అకాడెమి అవార్డును గెలుచుకొంది. ఆయన దాదాపు వంద కథలు కూడా రాశారు.

దేవదాసీల ఆత్మకథలు, జీవిత చరిత్రలు దక్షిణ భారతదేశంలో బాగా వచ్చాయి. వారి జీవితాల్లోకి తొంగి చూసి, పరిశోధించి, అర్థం చేసుకొని చేసిన రచనే మధురాంతకం నరేంద్ర గారి నవల మనోధర్మపరాగం. ముప్ఫైమందికి పైగా దేవదాసీల జీవితాల్లో వారు నటీమణులుగా, గాయకులుగా, కళా ప్రదర్శకులుగా ఎలా ఎదిగారు అన్నది మనం చూడొచ్చు. వారి అనుభవాలనే ఎంతో లయాత్మకంగా చూపించారని డా.కె.ఎస్.రావు అంటారు. ఈ నవలలో వారి అస్తిత్వ భారంతో పాటు, వారు దాని ద్వారానే పేరు గడించడం, భవిష్యత్తును చూసుకోవడం చూస్తాం. సంగీతం పట్ల వారి నిబద్ధత అపూర్వం. కాని జీవితాలను అలాగే అంగీకరించడం అన్నది వారి విధి అనుకోవడం వల్ల వారి కష్టాలు అలాగే ఉన్నాయి. నవలలోని పాత్రలు తమను సంగీతానికి, నాట్యానికి ఉన్న సంబంధం రీత్యానే చూసుకుంటారు. ఎన్నో సంవత్సరాలు వారిని అమానవీయంగా చూసిన విషయాన్ని నవల తెలియజేస్తుంది. ఎంతో ఆవేశంతో రాసిన ఈ నవలలో వారి జీవితాల్లోకి సాగిన అన్వేషణ చూడొచ్చు, మరీ ముఖ్యంగా కర్నాటక సంగీతంలో వారు చేసిన ప్రయోగాలే ఉదాహరణలు. వారు సంకటస్థితిలో ఉన్న తమ ఆత్మగౌరవానికి ఎలాంటి భంగం రాకుండా సంగీతంలోనే ఆనందాన్ని, ప్రేమను వెదుక్కోవడం చూస్తాం. నిజజీవితంలో ఆస్తులపైన, విలాసవంతమైన సౌకర్యాలపైన వారికి ధ్యాసే ఉండదు. ఎక్కువ పాత్రలు తమ కథనే చెబుతాయి. బ్రాహ్మణ పోషకులకు తాము ఎలా ఉంపుడు కత్తెలుగా ఉన్నామో తెలియజేస్తాయి. ప్రొ.తిరుమలరావు గారన్నట్టు ఈ నవలలో రచయిత ఎక్కడా నీతివాద స్థానాన్ని తీసుకోలేదు. సంఘటనల మధ్య లింకులను కలపడంలో బాధ్యతాయుతంగా చేసారు.

నవలలో ఉన్న పాత్రలను నిజజీవితంలో ఉన్నవారివేనని మనకు తెలిసిపోతుంది. పాఠకులకు ఆ పాత్రలు రోజూ చూసేవారే అన్న స్పృహ కలుగుతుంది. శతాబ్దానికి పైగా దేవదాసీలుగా ముద్రపడి నిర్లక్ష్యం చేయబడ్డవారి జీవితాలను చూపుతారు రచయిత. పుస్తకానికి ముందు ఆయనే ఆ మాట చెప్పారు. ఐతే నవలగా మార్చే భాగంలో కొంత కల్పన చేయవలసి వస్తుంది. అప్పుడే నవలలో పట్టు పెరుగుతుంది. జీవితంలో దేవదాసీలపై చాలామందికి ఎవరికి తోచిన అహగాహన వాళ్ళకు ఉంటుంది. వాటికి విరుద్ధంగా నవలలో వారిని కళాకారులుగా, వ్యక్తిత్వం కలవారుగా చూపుతారు. వారిపై గౌరవాన్ని కలిగిస్తారు. వారి చుట్టూ అల్లుకున్న పుకార్లు మొదలైనవాటి ప్రభావం తన పాత్రలపై పడకుండా జాగ్రత్తపడ్డారు రచయిత.

నవలను చదివిన పాఠకులకు అందులోని కథనం, చిత్తూరు జిల్లా మాండలికంలో దేవదాసీల జీవిత చిత్రణ మనోహరంగా అనిపిస్తుంది. కొంత తమిళ భాష ప్రభావం కూడా కనిపిస్తుంది. ఈ సజీవ పాత్రలను చూస్తుంటే గురజాడ కన్యాశుల్కంలోని మధురవాణి మనకు గుర్తొస్తుంది. దేవదాసీ నాగలక్ష్మి తల్లి కంటే తన తల్లి గొంతు బాగుంటుందని, ఐతే వీళ్ళు పాడడం వల్లే మా అమ్మ ఉన్నత కులంలో పుట్టిన స్త్రీ ఐనందువల్లే కచేరీలలో పాడడం లేదని గాయత్రి పాత్ర అనుకోవడం రచయిత ఎంత సున్నితంగా సంఘటనల్ని చిత్రిస్తారు అర్థమవుతుంది. దేవదాసీల్లో కొందరు బలవంతంగానే వేశ్యలుగా మారడం గురించి కూడా ఆయన పేర్కొంటారు. వాళ్ళు ఎందుకు ఎలా రాజీపడుతున్నారో ఒక పాత్ర ద్వారా చెబుతారు. కుటుంబ స్త్రీల జీవితాలకంటే దేవదాసీల జీవితాలే నయమని, అందుకే ఫలానా పోషకునితో వెళ్ళిపొమ్మని మూగాంబిక అనే దేవదాసీ అనడం కూడా పాఠకులను ఆలోచింపజేస్తుంది. నవలలో ఇతర ప్రాంతాలకు చెందిన దేవదాసీ గాయకుల గురించి గొప్పగా చెప్పడం చూడొచ్చు. మనుధర్మశాస్త్రం, కామశాస్త్రం కూడా దేవదాసీలు తెలుసుకొని తమ కళలపై వాటి ప్రభావం ఉందని ఒక పాత్ర చెబుతుంది. దేవదాసీల మధ్య ఉండే వైరుధ్యాలను కూడా కొన్ని పాత్రల సంభాషణల్లో చూస్తాము.

ఆ వికటిత జీవితాల చుట్టూ ఉండే సమాజం, సంబంధాలు, మనుషుల ఆవేశాలు, ఆలోచనలు, ప్రవర్తనను ఎదుర్కొంటూనే తమ మనో నిబ్బరంతో వారు వెదజల్లే హృదయ పరిమళాలనే మనోధర్మ పరాగంగా రచయిత నవలీకరించారు. ఇందుకు వారిపై ఆయనకున్న సానుభూతి, గౌరవం ఈ నవలలో మనం చూడొచ్చు. ఒక మంచి నవలను పురస్కారానికి ఎంచుకున్న సాహిత్య అకాడమీ ఈ నవలను మరింతగా పాఠకుల దగ్గరకు తీసుకుపోతుంది. ఈ సందర్భంగా రచయితకు అభినందనలు.

– జంధ్యాల రఘుబాబు,
98497 53298

ఉద్ధవ్ థాకరేపై మళ్లీ విచారణ

నాగ్‌పూర్ : ఉద్ధవ్ థాకరేపై మరోసారి విచారణ జరుపుతామని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఉద్ధవ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమరావతిలో ఫార్మాసిస్ట్ మరణాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించారని ఆరోపిస్తూ, విచారణ జరపనున్నట్లు ఇంటెలిజెన్స్ ప్రకటించింది. మహ్మద్ ప్రవక్తపై వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురైన బిజెపి అధికార ప్రతినిధి నూపుర్ శర్మకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకు ఫార్మాసిస్ట్ ఉమేష్ కోలే హత్యకు గురైనట్లు దర్యాప్తు బృందం పేర్కొంటోంది. థాకరే కుటుంబాన్ని కించపరిచేందుకే రాజకీయ ప్రేరేపిత చర్య అని ఉద్ధవ్ పక్ష శివసేన అధికార ప్రతినిధి హర్షల్ ప్రధాన్ అన్నారు.

పిల్లలకు శాంటాక్లాజ్ దుస్తులు వేయొద్దు

- మధ్యప్రదేశ్‌లో పాఠశాలలకు విహెచ్‌పి బెదిరింపులు

న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్‌లో విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. క్రిస్మస్ సందర్భంగా హిందూమతానికి చెందిన పిల్లల తల్లిదండ్రుల అనుమతి లేకుండా వారి పిల్లలకు శాంటాక్లాజ్ దుస్తులు వేయరాదని, ఒకవేళ అలా చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని విహెచ్‌పి పత్రికా ప్రకటనే విడుదల చేసింది. హిందూ మతానికి చెందిన పిల్లల్ని శాంటాక్లాజ్ దుస్తులు వేసుకోమన్నా, క్రిస్మస్ ట్రీ తీసుకురావాలని చెప్పినా.. ఆ స్కూల్ సంగతి తేల్చుతామని బోపాల్ విహెచ్‌పి ప్రాంతీయ ప్రచారక్ జితేంద్ర చౌహాన్ శనివారం ఓ ప్రకటనలో బెదిరింపులకు పాల్పడ్డారు. పిల్లల్ని క్రైస్తవం వైపు ఆకర్షించే ప్రయత్నమని తెలిపారు. .

నటి తునీషా శర్మ ఆత్మహత్య

- సహనటుడు షీసన్ ఖాన్ అరెస్ట్



ముంబై : బుల్లితెర నటి తునీషా శర్మ (20) అనుమానాస్పద మృతి కేసులో సహ నటుడు షీసన్ ఖాన్‌ను అరెస్టు చేశారు. తునీషా శర్మ అలీ బాబా దస్తాన్ ఇ కాబూల్ సెట్స్‌లో ఉరికి వేలాడుతూ కనిపించింది. నటి మృతి ఆత్మహత్యగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చినప్పటికీ, తునీషా తల్లి ఫిర్యాదు మేరకు షీసన్‌పై కేసు నమోదు చేశారు. తునీషా షీసన్ ఖాన్‌ల మధ్య వివాదం నేపథ్యంలో బాధ పడుతోందని, అందుకే ఆత్మహత్యకు పాల్పడిందని తునీషా తల్లి పోలీసులకు తెలిపింది. వారి మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భారత్ క వీర్ పుత్ర – మహారాణా ప్రతాప్ సిరీస్ ద్వారా తునీషా టెలివిజన్ రంగంలోకి ప్రవేశించింది. చక్రవర్తి అశోక సామ్రాట్, గబ్బర్ పూంజ్వాలా, షేర్–ఎ–పంజాబ్ తదితర టివి సీరియళ్లలో పలు పాత్రలు పోషించింది. కొన్ని చిత్రాల్లో కూడా కనిపించింది. బార్ బార్ దేఖోలో తునీషా కత్రినా కైఫ్ చిన్న నాటి పాత్ర పోషించిన ఆమె ఫితూర్, కహానీ 2, దబాంగ్ 3లో నటించింది.



ఈజిప్టులో కూలిన స్టేడియం

కైరో : ఈజిప్టు రాజధాని కైరోలో బాస్కెట్‌బాల్ మ్యాచ్ స్టేడియం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో 27 మంది గాయపడినట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి హోసామ్ అబ్దుల్ గఫార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ అధినేత హసన్ ముస్తఫా పేరిట ఉన్న మల్టీ పర్పస్ ఎరీనాలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. అల్ అహ్లీ,0 ఇత్తిహాద్ మధ్య జరిగిన సూపర్ కప్ మ్యాచ్ సందర్భంగా, మెటల్ స్టాండ్ ప్రాంతంలో తొక్కిసలాట జరిగిందని అధికారులు తెలిపారు. దీంతో సీట్లలో కొంత భాగం విరిగి ప్రేక్షకులపై పడిందని అన్నారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ప్రయివేటులో రిజర్వేషన్లపై చర్చేది?

- అమలుకు రాజ్యాంగమూ అనుకూలమే
- అయినా పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



న్యూఢిల్లీ : దేశంలో సామాజిక న్యాయం పాలకవర్గ రాజకీయ పార్టీలకు ఎన్నికల్లో ఒక ఆయుధంగానే ఉంటున్నది. సామాజిక న్యాయం అంటూ ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చే ఆయా పార్టీలు ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని పక్కనబెట్టేస్తున్నాయి. తమ చేతుల్లో అధికారం ఉన్నప్పటికీ.. కార్పొరేటు, ప్రయివేటు 'ఉన్నత వర్గాలకు' దాసోహమంటున్నాయి. దీంతో కార్పొరేటు, ప్రయివేటు ఉన్నత వర్గం ఆర్థికంగా మరింత ఎత్తుకు ఎదుగుతున్నది. కానీ, దేశంలోని అణగారిన వర్గాల ప్రజలు మాత్రం తక్కువ జీతాలు అందే ఉద్యోగాల్లో పని చేస్తూ తీవ్ర ఆర్థిక అసమానతకు గురవుతున్నాయని సామాజికవేత్తలు, నిపుణులు తెలిపారు.

దేశంలో అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉద్దేశించిన ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను భారత సర్వోన్నత న్యాయస్థానం సమర్థించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనంలోని న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ మహేశ్వరి చేసిన వ్యాఖ్యలు ఆలోచింపజేసేలా ఉన్నాయి. ప్రయివేటు విద్యాసంస్థలు రిజర్వేషన్‌ను అనుసరించే అంశాన్ని దినేశ్ మహేశ్వరి లేవనెత్తారు. ఆ సమయంలో మాత్రం ఈ అంశంపై ఎలాంటి చర్చా జరగలేదు. దీంతో ప్రయివేటు విద్యాసంస్థల్లో రిజర్వేషన్ అంశం అనేది అంతగా జనబాహుళ్యంలోకి రాలేకపోయిందని సామాజికవేత్తలు అన్నారు.

నిజానికి ప్రయివేటు విద్యాసంస్థల్లో రిజర్వేషన్‌కు భారత రాజ్యాంగమూ సమ్మతిస్తుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5) ప్రకారం ప్రయివేటు సంస్థల్లో రిజర్వేషన్‌ను తప్పనిసరి చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని జస్టిస్ మహేశ్వరి పేర్కొన్నారు. "వృత్తిపరమైన విద్య అందించే సంస్థలతో సహా అన్‌ఎయిడెడ్ ప్రయివేటు సంస్థలు జాతీయ స్రవంతి నుంచి వేరుగా ఉన్నట్టు చూడలేము. ప్రయివేటు సంస్థల్లో రిజర్వేషన్లు ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించవు. కాబట్టి, విద్యను అందించే ప్రయివేటు సంస్థల్లో రిజర్వేషన్లను ఒక భావనగా తోసిపుచ్చలేము" అని ఆయన అన్నారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ మినహాయింపు అనేది అణగారిన వర్గాల ప్రజలకు ఒక శాపంగా మారిందని నిపుణులు తెలిపారు. భారత్‌లో కులచీలికలు తీవ్రమైన తరుణంలో ప్రయివేటు రంగం అనుభవిస్తున్న రాజ్యాంగ నిరోధక శక్తిపై చర్చించాల్సిన అవసరం ఉన్నదని వారు చెప్పారు.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాలు దేశంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలు, విద్యార్థులకు శాపంగా మారాయని వామపక్షాలు, సామాజిక కార్యకర్తలు విమర్శిస్తున్నారు. ఎస్‌సి, ఎస్‌టిల కోసం రిజర్వు చేయబడిన లక్షల ఉద్యోగాలు ప్రయివేటీకరణ కారణంగా కోల్పోయాయని తెలిపారు. ఈ విషయంపై ప్రజలు, విద్యార్థులు, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ అజెండాతో పనిచేస్తున్న పాలక పార్టీలను ప్రశ్నించాలనీ, దాని ద్వారానే దేశంలో సామాజిక పరివర్తన సాధ్యమవుతుందని చెప్పారు.

ఉత్పాదక ఉపాధి, ప్రయివేటు రంగంలో మంచి జీతంతో కూడిన ఉద్యోగాలకు సమాజంలోని ప్రత్యేక వర్గాలకు పరిమితమని తేలిందనీ ఆర్థిక వేత్త అశ్విని దేశ్‌పాండే, సామాజిక శాస్త్రవేత్తలు కేథరీన్, న్యూమాన్, సురీందర్ ఎస్. జోధ్కా చేసిన ఒక అధ్యయనం తేల్చింది. భారతీయ స్టాక్ ఎక్స్ఛేంజీలో జాబితా చేయబడిన టాప్ వెయ్యి కంపెనీల నమూనా ఆధారంగా, 2010 అధ్యయనం ప్రకారం, భారతీయ కార్పొరేటు రంగంలో కుల వైవిధ్యం లేదనీ, 65 శాతం భారతీయ కార్పొరేటు బోర్డు సభ్యులు 'ఒక ఉన్నత కుల' సమూహం నుంచి ఉన్నవారేనని వెల్లడికావడం గమనార్హం.

అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం 2019లో నిర్వహించిన ఒక అధ్యయనంలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలు తక్కువ జీతం పొందుతున్నాయని తేలింది. వివక్షత, పక్షపాతంతో కూడిన కార్పొరేట్ హెచ్‌ఆర్ విధానాలు లేకుండా ప్రయివేటు రంగం ఉద్యోగాల్లో అట్టడుగు వర్గాలకు తక్కువ ప్రాతినిధ్యమనేది సాధ్యం కాదని అధ్యయనం సూచిస్తున్నది. ఈ విధానం మారి దేశంలోని అణగారిన వర్గాల ప్రజలకు ప్రయివేటు రంగంలోనూ చక్కని అవకాశాలు రావాలంటే ప్రభుత్వాలు నియంత్రణా చర్యలను అమలు చేయాలని నిపుణులు సూచించారు.

పండగల్లో కరోనా జాగ్రత్తలు తీసుకోండి

మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ



ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

'పండగలను ఆనందించండి. కానీ కరోనా జాగ్రత్తలు తీసుకోండి' అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ప్రపంచంలో వివిధ దేశాల్లో కరోనా వైరస్ విస్తరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం జరిగిన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పండుగలను ఆస్వాదించేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాస్కులు ధరించడం, చేతులు కడుక్కోవడం, భౌతికదూరం వంటి ప్రొటోకాల్స్‌ను పాటించాలని అన్నారు. 'దేశం కొత్త శిఖరాలను తాకుతూ ఉండనివ్వండి, 2023లో మనం కలిసి ఒక తీర్మానం చేయాలి. దానిని నిజం చేయాలి" అని అన్నారు. జి–20 ఉత్సాహాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని, ఈ ఈవెంట్‌ను ఒక సామూహిక ఉద్యమంగా మార్చాలని పేర్కొన్నారు. యోగా, ఆయుర్వేదం ఆధునిక యుగ పరీక్షలకు గీటురాయిగా నిలుస్తున్నాయని అన్నారు. భారతదేశం 220 కోట్లకు పైగా వ్యాక్సినేషన్ డోస్‌లు ఇవ్వడం ద్వారా ప్రపంచంలోనే ఒక ప్రత్యేకమైన గుర్తింపును సాధించిందని, గ్లోబల్ ఎకానమీలో ఐదో స్థానంలో నిలిచిందని అన్నారు. ఎగుమతుల విషయంలోనూ 400 బిలియన్ డాలర్ల విలువచేసే మేజికల్ ఫిగర్‌ను సాధించిందని చెప్పారు. అంతరిక్ష, రక్షణ, డ్రోన్ రంగాల్లో కొత్త పుంతలు తొక్కిందని, క్రీడల్లోనూ విజయాలను సొంతం చేసుకున్నామని అన్నారు. అందరికీ "మెర్రీ క్రిస్మస్" శుభాకాంక్షలు తెలుపుతూ, ఇది యేసుక్రీస్తు జీవితం, బోధనలను గుర్తుచేసుకునే రోజు అని పేర్కొన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయనకు మోడీ నివాళులర్పించారు.

ఉత్తరాఖండ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకపై దాడి

- కర్రలతో దాడి చేసిన మతతత్వ సంస్థ గూండాలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌కు 150కిలోమీటర్ల దూరంలో ఉన్న పురోలా గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న వారిపై హిందూ మతతత్వ సంస్థ గూండాలు దాడికి పాల్పడ్డారు. రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన మతమార్పిడి నిరోధక బిల్లు.. శనివారం ఆమోదం పొందింది. దీంతో ఆ గూండాలు రెచ్చిపోయారు. సెమీ క్రిస్మస్ సందర్భంగా 'హోప్ అండ్ లైఫ్ సెంటర్'లో శుక్రవారం ప్రార్థనలు నిర్వహించగా... ముస్సోరిలోని యూనియన్ చర్చికి చెందిన పాస్టర్ హాజరయ్యారు. కర్రలు పట్టుకుని అక్కడికి చేరుకున్న సుమారు 30 మంది మతతత్వ సంస్థ కార్యకర్తలు ప్రార్థనలు నిలిపివేయాలంటూ బెదిరించారు. బలవంతపు మత మార్పిడులు చేస్తున్నారంటూ కర్రలతో దాడికి దిగారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పాస్టర్ లాజరస్ కార్నెలియస్, ఆయన భార్య సుష్మా సహా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విడుదల చేసినట్టు జిల్లా అధికారి తెలిపారు.

మంచు తుపాను విధ్వంసం



- అమెరికాలో భారీగా విద్యుత్ కోతలు
- వేర్వేరు ఘటనల్లో 18 మంది మృతి

వాషింగ్టన్ : అమెరికాలో మంచు తుపాను బీభత్సం సృష్టిస్తోంది. విద్యుదుత్పత్తి కేంద్రాల సామర్థ్యం పడిపోవడంతో, పలు నివాసాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సుమారు 60 శాతం మంది మంచు తుపానుతో విలవిల్లాడుతున్నారు. సుమారు ఏడు లక్షల మంది కంటే ఎక్కువ మంది అమెరికన్లు క్రిస్మస్ వేడుకల సమయంలోనూ విద్యుత్ కోతలకు గురయ్యారని రాయిటర్స్ నివేదిక తెలిపింది. భారీ శీతల గాలులు, హిమపాతం, కారు ప్రమాదాల కారణంగా సుమారు 18 మంది మరణించినట్లు పేర్కొంది. మంచు తుపాను, క్రిస్మస్ సెలవుల కారణంగా అనేకమంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారని తెలిపింది. శనివారం 2,700 కంటే ఎక్కువ విమానాలు రద్దయ్యాయని, 6,400 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని రాయిటర్స్ పేర్కొంది.

న్యూఇంగ్లాండ్ ప్రాంతంలో అత్యధికంగా విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడిందని, 2,81,651 మంది ప్రభావితమయ్యారని సిఎన్ఎన్ పేర్కొంది. ఆదివారం నాటికి పశ్చిమ న్యూయార్క్‌లో విద్యుత్‌ను పునరుద్ధరించగలిగామని రాష్ట్ర గవర్నర్ కాథీ హోచుల్ తెలిపారు. మంచు తుపాను ఇంకా ముగియలేదని ఆయన ట్వీట్ చేశారు. ప్రజలు నివాసాల్లోనే ఉండాలని, ప్రయాణాలు చేయవద్దని సూచించారు. న్యూయార్క్‌లోని బఫా ప్రాంతంలో గంటకు 96 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని మీడియా తెలిపింది. విజిబిలిటీ సున్నాకి దగ్గరగా ఉందని పేర్కొంది.

భారత్‌తో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధం

- చైనా విదేశాంగ మంత్రి



బీజింగ్ : స్థిరమైన, ధృడమైన సంబంధాల కోసం భారత్‌తో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందని ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ యి తెలిపారు. 2022లో అంతర్జాతీయ పరిస్థితులు, చైనా విదేశీ సంబంధాలు అనే అంశంపై ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'భారత్, చైనాలు దౌత్య, సైనిక–మిలటరీ మార్గాల ద్వారా కమ్యూనికేషన్‌ను కొనసాగించాయి. సరిహద్దు ప్రాంతాల్లో స్థిరత్వాన్ని కొనసాగించడానికి రెండు దేశాలు కట్టుబడి ఉన్నాయి' అని మంత్రి చెప్పారు. భారత్, చైనాల మధ్య స్థిరమైన, ధృడమైన సంబంధాల కోసం భారత్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) అత్యంత ప్రభావవంతమైన వేదికగా మారిందని మంత్రి తెలిపారు. మంత్రి తన ప్రసంగంలో పాకిస్థాన్–చైనా మధ్య సంబంధాలను కూడా ప్రస్తావించారు. చైనాపై అమెరికా అనుసరిస్తున్న తప్పుడు విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా చైనాను తమ ప్రాథమిక పోటీదారుగా చూడ్డం, చైనాకు వ్యతిరేకంగా కఠినమైన ఆంక్షలు విధించడం, అణిచివేత, రెచ్చగొట్టడం వంటి విధానాలను అమెరికా అనుసరిస్తున్న కారణంగానే అమెరికా, చైనా మధ్య సంబంధాలు సంక్లిష్టంగా మారాయని మంత్రి చెప్పారు. తైవాన్ అంశంపై అమెరికా బెదిరింపులకు చైనా భయపడదని కూడా వాంగ్ తెలిపారు. చైనా, రష్యా మధ్య సంబంధాలు వృద్ధి దిశగా సాగుతున్నాయని వెల్లడించారు.

బీజింగ్ ఆసుపత్రుల్లో తగ్గుతున్న రద్దీ

బీజింగ్ : చైనా రాజధాని బీజింగ్‌లోని ఆసుపత్రుల్లో రద్దీ క్రమంగా తగ్గుతోంది. ఒమిక్రాన్ వేరియంట్ బిఎఫ్–7 సామాజిక వ్యాప్తి కారణంగా గత వారం రోజుల్లోనే బీజింగ్‌లో కేసులు ఉధృతమయ్యాయి. దీంతో ఆసుపత్రిల్లో చేరికలు ఎక్కువ అయ్యాయి. వైద్య ఉద్యోగులు కూడా ఎక్కువ సంఖ్యలో వైరస్ భారినపడ్డారు. దీంతో సిబ్బందికి కూడా కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆసుపత్రులపై ఒత్తిడి పెరిగింది. ఇతర వ్యాధులతో బాధపడుతున్నవారు, వృద్ధుల్లో ఈ వైరస్ ఎక్కువగా వ్యాపించడం కూడా ఆసుపత్రుల్లో రద్దీ పెరగడానికి కారణంగా చెబుతున్నారు. ఈ రద్దీ క్రమక్రమంగా తగ్గుముఖం పడుతుందని వైద్య నిపుణులు ఆదివారం తెలిపారు.

గాలి జనార్ధన రెడ్డి కొత్త పార్టీ



బెంగళూరు : కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్ధన రెడ్డి సొంత రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. 'కల్యాణ రాజ్య ప్రగతి పక్ష పార్టీ' పేరుతో కొత్త పార్టీని ఆదివారం బెంగళూరు లోని తన నివాసంలో ప్రకటించారు. వచ్చే కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. గంగావతి నియోజకవర్గం నుంచి బరిలోకి దిగనున్నట్లు ఆయన వెల్లడించారు. తాను ఇకపై బిజెపి సభ్యుడిని కాదని, బిజెపితో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు.

దర్శకుడు కెపి శశి కన్నుమూత



త్రిసూర్ : సినిమా, డాక్యుమెంటరీ దర్శకుడు, కార్టూనిస్ట్ కెపి శశి (64) కన్నుమూశారు. ఆయన కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపక నాయకులలో ఒకరైన కె దామోదరన్ కుమారుడు. కేరళలో మహిళలపై సామాజిక, మానసిక హింసపై ఆయన తీసిన 'ఇల యుమ్ ముల్లుమ్' చిత్రం జాతీయ అవార్డును గెలుచుకుంది. 70వ దశకంలో జెఎన్‌యులో విద్యార్థిగా ఉన్నప్పుడు కార్టూనిస్ట్‌గా జీవితం ప్రారంభించారు. ముంబైలోని ఫ్రీ ప్రెస్ జర్నల్‌లో కార్టూనిస్ట్‌గా పనిచేశారు. ఐఐబిజివైఐఆర్ ఫిల్మ్ ఫెస్టివల్ వ్యవస్థాపకులలో ఆయన ఒకరు. రెసిస్టింగ్ కోస్టల్ ఇన్వేషన్, అమెరికా అమెరికా, లివింగ్ ఇన్ ఫియర్ అండ్ డెవలప్‌మెంట్ ఎట్ గన్‌పాయింట్ తదితర చిత్రాలకు దర్శకత్వం వహించారు. 2013లో ఆయన రూపొందించిన డాక్యుమెంటరీ పెద్ద చర్చనీయాంశమైంది.

భవిష్యత్‌లో ఆటో గేర్ల కార్లదే హవా

న్యూఢిల్లీ : ఆటో మొబైల్ మార్కెట్‌లో భవిష్యత్‌లో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. కొనుగోలు దారుల అవసరాలకు అనుగుణంగా కార్ల మోడళ్లలో కొత్త కొత్త ఫీచర్లను అందుబాటులోకి తెచ్చేందుకు కార్ల తయారీ సంస్థలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ఇందులో 'ఆటో గేర్ షిఫ్ట్ (ఎజిఎస్)' సిస్టంను ప్రధానంగా పేర్కొంటున్నారు. ఏజీఎస్ సిస్టమ్ వల్ల డ్రైవర్‌గా గేర్ మార్చాలంటే క్లచ్ నొక్కి బ్రేక్ వేయనవసరం లేదు. అవసరాన్ని బట్టి ఆటోమేటిక్ గేర్ మారుతూ ఉంటుంది. దేశంలోట్రాఫిక్ రద్దీలో వాహనదారులు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేలా మారుతి సుజుకీ మరిన్ని మోడళ్లలో 'ఆటో గేర్ షిఫ్ట్ (ఏజీఎస్)' సిస్టంను అందుబాటులోకి తేనున్నట్లు ఆ సంస్థ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ శశాంక్ శ్రీవాత్సవ తెలిపారు.

మహిళలపై తాలిబన్ల ఆంక్షలను నిరసిస్తూ సేవలు నిలిపివేసిన ఎన్‌జిఒ సంస్థలు

కాబూల్ : మహిళల విద్య, ఉద్యోగాలకు సంబంధించి తాజాగా తాలిబన్లు ఆంక్షలు పెట్టడంతో సేవలు నిలిపివేస్తున్నట్లు మూడు ఎన్‌జిఒ సంస్థలు ఆదివారం ప్రకటించాయి. అంతర్జాతీయ, స్థానిక ప్రభుత్వేతర సంస్థల్లో మహిళలు పనిచేయకుండా నిషేధం విధించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి. సేవ్ ది చిల్డ్రన్, నార్వేజియన్ రెఫ్యూజీ కౌన్సిల్, కేర్ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ మహిళలు తమ సంస్థల్లో పనిచేయకుండా పిల్లలు, మహిళలకు సేవలందించలేమని తెలిపారు. "అంకితభావంతో కూడిన మహిళా సిబ్బంది లేకుండా మేము పని చేయలేం, లక్షల మంది ప్రాణాలను కాపాడటానికి, సేవలందించేందుకు మహిళలను యాక్సెస్ చేయడానికి మాకు చాలా అవసరం," నీల్ టర్నర్, ఆఫ్ఘనిస్తాన్ కోసం నార్వేజియన్ రెఫ్యూజీ కౌన్సిల్ చీఫ్, ఆదివారం అసోసియేటెడ్ ప్రెస్‌తో అన్నారు. ఈ గ్రూపులో దేశంలో 468 మంది మహిళా సిబ్బంది ఉన్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మానవతా కార్యకలాపాలకు మహిళలు కేంద్రంగా ఉన్నారని, వారిని సేవల నుంచి తప్పించడం సరికాదని అమెరికా దేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్ శనివారం అన్నారు.

ఉర్దూ గీతం పాడించారంటూ
శిక్షా మిత్ర, ప్రిన్సిపాల్ అరెస్టు

- విధుల్లో నుంచి తొలగింపు
- యుపిలో దారుణం

లక్నో : జాతీయ గీతానికి బదులుగా ప్రముఖ కవి మహ్మద్ ఇక్బాల్ రచించిన 'లాబ్ పే ఆతి హై దౌ' అనే ఉర్దూ గీతం విద్యార్థులు పాడినందుకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్, శిక్షా మిత్రను అరెస్టు చేయడంతోపాటు, విధుల్లోంచి తొలగించిన దారుణ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బరేలి జిల్లాలో జరిగింది. మిర్ధాన్ ఫరీద్‌పూర్ పాఠశాలలో ఉదయం అసెంబ్లీ సమయంలో విద్యార్థులు జాతీయగీతానికి బదులుగా ప్రముఖ కవి మహమ్మద్ ఇక్బాల్ రచించిన గీతాన్ని పాడారు. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఈ సంఘటనపై విశ్వ హిందూ పరిషత్ సభ్యులు బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో, పాఠశాల శిక్షా మిత్రగా పనిచేస్తున్న 55 ఏళ్ల వాజీరుద్దీన్‌ను శుక్రవారం అరెస్టు చేసి, జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. పాఠశాల విద్యా శాఖ వాజీరుద్దీన్‌ను విధుల నుంచి తొలగించింది. ఈ ఘటన సమయంలో ప్రిన్సిపాల్ నహిద్ సిద్ధికీ సెలవులో ఉన్నారు. అయినా సిద్ధికీని కూడా పోలీసులు జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. సిద్ధికీ, వాజీరుద్దీన్‌పై ఐపిసిలోని సెక్షన్లు 298, 153 కింద కేసు నమోదు చేశారు. జాతీయ గీతానికి బదులుగా ఉర్దూ గీతం పాడటం అరెస్టు చేసేంత నేరమా? అన్న విలేకరుల ప్రశ్నకు జిల్లా ఎస్‌పి (గ్రామీణం) రాజ్‌కుమార్ అగర్వాల్ వివరణ ఇచ్చారు. 'హిందువుల మనోభావాలు దెబ్బతీసినందుకు అరెస్టు చేశాం' అని ఎస్‌పి తెలిపారు. సంఘటన వీడియోను ఫోరెన్సిక్ పరీక్షకు పంపినట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ సిద్ధికీని ఇప్పటికే సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాధికారి వినయ్ కమార్ తెలిపారు. వాజీరుద్దీన్ 2007 నుంచి శిక్షా మిత్రగా పనిచేస్తున్నారు. కుటుంబంలో ఉద్యోగం చేస్తున్న ఆయన అరెస్టు కావడంతో, మరో ఆధారం లేక ఆయన కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆప్ మంత్రి సత్యేందర్ జైన్‌కి సౌకర్యాల తొలగింపు

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ మంత్రి సత్యేందర్ జైన్‌కు జైలులో కల్పిస్తున్న పలు సౌకర్యాలను ప్రభుత్వం తొలగించింది. ఇటీవల బిజెపి విడుదల చేసిన వరుస వీడియోల నేపథ్యంలో ఆయనను సందర్శకులు కలుసుకునేందుకు వీలులేకుండా 15 రోజుల పాటు శిక్ష విధించింది. ఆయనకు సెల్, టేబుల్, కుర్చీ వంటి అన్ని సౌకర్యాలను తొలగించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సుల మేరకు సత్యేందర్‌పై ఈ చర్యలు తీసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. అప్పటి జైలు అధికారి సందీప్ గోయెల్ కారణంగానే సత్యేందర్‌కు జైల్లో విఐపి ట్రీట్ మెంట్ లభించిందన్న విమర్శలు రావడంతో గోయెల్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసినట్లు కమిటీ పేర్కొంది.



పారదర్శకంగా నియామకాలు చేపట్టాలి

- పశ్చిమ బెంగాల్ సిపిఎం కార్యదర్శి సలీమ్

ధర్మతల : పశ్చిమ బెంగాల్‌లో ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా చేపట్టాలని సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీమ్ డిమాండ్ చేశారు. ధర్మతలలో ఆందోళన చేస్తున్న వారికి ఆయన మద్దతు ప్రకటించారు. ఉద్యోగ నియామకాల్లో అవకతవకలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని, అర్హులైన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆప్తులను కోల్పోవడం బాధాకరం

- కింగ్ ఛార్లెస్ 3 క్రిస్మస్ సందేశం



లండన్ : ప్రియమైన వ్యక్తులను కోల్పోవడం బాధాకరమని బ్రిటన్ రాజు కింగ్ ఛార్లెస్ 3 తెలిపారు. ఆదివారం క్రిస్మస్ సందర్భగా ఛార్లెస్ తన సందేశాన్ని ఇచ్చారు. బ్రిటన్ రాజు హోదాలో ఛార్లెస్‌కు ఇదే మొదటి క్రిస్మస్ సందేశం. టివి ద్వారా ఇచ్చిన ఈ సందేశంలో తన తల్లిని, ప్రభుత్వ ఉద్యోగుల సేవలను ఛార్లెస్ గుర్తు చేసుకున్నారు. ఛార్లెస్ తన ప్రసంగంలో తన తల్లి వద్ద నుంచి మంచితనం, కరుణలపై నమ్మకాన్ని పెంచుకున్నట్లు తెలిపారు. ఛార్లెస్ తల్లి, బ్రిటన్ రాణి ఎలిజిబెత్ 96 ఏళ్ల వయస్సులో ఈ ఏడాది సెప్టెంబర్‌లో కన్నుమూశారు. 'ప్రియమైన వ్యక్తులను కోల్పోయిన మనందరికీ క్రిస్మస్ చాలా బాధకరమైన సమయం' అని ఛార్లెస్ పేర్కొన్నారు. ఎలిజిబెత్ ఎప్పుడూ చేసే డెస్క్ నుంచి కాకుండా సెయింట్ జార్జ్ చాపెల్ చర్చిలోని క్రిస్మస్ ట్రీ వద్ద నుంచి ఛార్లెస్ తన క్రిస్మస్ ప్రసంగం చేశారు. ఈ చర్చిలోనే ఛార్లెస్ తల్లిదండ్రులను సమాధి చేశారు. ఛార్లెస్ తన ఆరు నిమిషాల ప్రసంగంలో చివరిగా 'శాశ్వతమైన వెలుగు'ను అనుసరించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పాక్‌లో తాలిబన్ల బీభత్సం

రెండు రోజుల్లో ఆరుగురు భద్రతా సిబ్బంది హత్య

కరాచీ : పాకిస్థాన్‌లో తాలిబన్లు రెచ్చిపోతున్నారు. గత రెండు రోజుల్లో బలోచిస్తాన్ రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్తాన్ (టిటిపి) బృందం చేసిన దాడుల్లో ఆరుగురు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని పాకిస్థాన్ సైన్యం మీడియా విభాగం ఆదివారం ప్రకటించారు. జోభ్ జిల్లాలోని సంబజ ప్రాంతంలో జరిగిన కాల్పుల ఘటనలో ఒక సైనికుడు, తాలిబన్ ఉగ్రవాది మృతి చెందినట్లు తెలిపారు. డన్నక్ గోడ్డన్ ప్రాంతంలో సైన్యం వాహనంపై తాలిబన్లు దాడికి పాల్పడ్డగా, నలుగురు సైనికులు మృతి చెందారు. సరిహద్దు పట్టణం చమన్ వద్ద తాలిబన్లు జరిపిన దాడిలో ఒక సైనికుడు మృతి చెందాడు. ఇస్లామాబాద్, లాహోర్, ఇతర ప్రాంతాల్లోనూ తాలిబన్లు దాడులకు తెగబడుతున్నట్లు పాక్ సైన్యం పేర్కొంది.

చర్చలకు మేం సిద్ధం

- నిరాకరిస్తున్నది ఉక్రెయిన్, పశ్చిమ దేశాలే
- రష్యా అధ్యక్షుడు పుతిన్

మాస్కో : ఉక్రెయిన్‌లో యుద్ధంలో పాల్గొంటున్న అన్ని పక్షాలతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. ఉక్రెయిన్, దాని వెనక ఉన్న పశ్చిమ దేశాలు చర్చలను తిరస్కరిస్తున్నాయని పుతిన్ తెలిపారు. తమ లక్ష్యాలన్నింటినీ సాధించే వరకూ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. 'యుద్ధంతో ప్రమేయం ఉన్న ప్రతీ ఒక్కరితో ఆమోదయోగ్యమైన పరిష్కారాల కోసం చర్చలు జరపడానికి మేం సిద్ధంగా ఉన్నాం. అది వారి ఇష్టం. చర్చలకు నిరాకరిస్తున్నది మేం కాదు... వారే' అని ఆదివారం ప్రసారమైన రోసియా 1 స్టేట్ టెలివిజన్ ఛానల్ ఇంటర్వ్యూలో పుతిన్ తెలిపారు. రష్యాను 'ఛిన్నాభిన్నం' చేయడమే పశ్చిమ దేశాల లక్ష్యమని పుతిన్ విమర్శించారు. రష్యన్ ప్రజలను ఏకం చేయడమే తమ లక్ష్యమని పుతిన్ తెలిపారు. 'మేం సరైన దిశలోనే వెళుతున్నాం. మా దేశ ప్రయోజనాలను, మా పౌరుల, ప్రజల ప్రయోజనాలను పరిరక్షిస్తున్నాం' అని పుతిన్ చెప్పారు.



మీకోసం

పింగాణీ, గాజు పాత్రలను శుభ్రపరిచేటప్పుడు సింకు అడుగున పాత బట్టను వేస్తే అవి దెబ్బతినకుండా ఉంటాయి.

జీవన సౌరభం

పనిలో అడ్డంకులు వస్తే ఆపాల్సింది పని కాదు; ప్రయత్నించే విధానం.

వీధిలో పాఠం




వీధిలోకి
పీచు మిఠాయి వాడు వచ్చాడు
గులాబీ రంగు దూదిలా
పీచు మిఠాయి..
అంగారక గ్రహంలో మబ్బులు
గులాబీ వర్ణంలో వుంటాయట..
క్లాసులో సైన్స్ మాస్టారు చెప్పారు

వీధిలోకి
బొంబాయి మిఠాయి వచ్చింది
చేతికి వాచీలా చుట్టాడు
చేతి గడియారాలకి స్విట్జర్లాండ్ ప్రసిద్ధి అట
క్లాసులో సోషల్ టీచర్ చెప్పారు

వీధిలోకి
మామిడి పళ్లు వచ్చాయి
పదమూడు పళ్లని 'పరక' అంటారని
క్లాసులో లెక్కల సారు చెప్పారు

వీధిలోకి
వెలగ పళ్లు వచ్చాయి
గుట్టు చప్పుడు కాకుండా
అంతా గుటకాయ స్వాహా చేసే
ప్రబుద్ధుల గురించి
'కరి మింగిన వెల పండు' సామెతని
తెలుగు అయ్యవారు చెప్పారు!

- ఎస్. హనుమంతరావు
88978 15656




లెక్క తేల్చండి

చిన్నారులూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 171

నేను గీసిన బొమ్మ





- ఎస్. గురుకృష్ణ, 7వ తరగతి, జడ్. పి. ఉన్నతపాఠశాల, మైదుకూరు, కడప జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆన్‌లైనే... అన్నిటికీ మెయిన్...!


రెండేళ్ల కోవిడ్ సృష్టించిన విలయం నుంచి ఈ ఏడాది కొంత ఊరట పొందాం. ఎన్నో అనుభవ పాఠాలు మన కళ్లముందు సాక్షాత్కరించాయి. 20వ శతాబ్దపు ఆరంభంలో మొదలైనా నత్తనడకన సాగిన అనేక మార్పులు కోవిడ్ తరువాత చాలా స్పష్టంగా వేగంగా మారాయి. అలా 21వ శతాబ్ద నూతన మార్పులకు కోవిడ్ నాంది పలికింది. ఎన్నాళ్ల నుంచో మనకు సరిపడవని, అలవాటు లేనివని పక్కన పెట్టేసిన ఎన్నో పోకడలను అలవరుచుకున్నాం. ఆదాయాలు పెరగక పోయినా, వ్యయం పెరిగినా, అవసరమున్నా.. లేకపోయినా.. వాటినే అనుసరించాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయి.

ట్రెండ్ 2022

కోవిడ్ కాలంలో జనజీవనం పూర్తిగా స్తంభించి నగరాలు ఖాళీ అయ్యాయి. ఉపాధి కోసం వేల కిలోమీటర్లు దాటి ప్రయాణించిన నగర పునరావాసులంతా సొంతూళ్లకు వెళ్లిపోయారు. వీరిలో అందరూ కాకపోయినా కొంతమంది గ్రామాల్లోనే ఉపాధిమార్గాలు ఎంచుకున్నారు. చిన్న చిన్న పెట్టుబడులతో సొంత వ్యాపారాలు చేశారు. కాస్తో కూస్తో పోగు చేసుకున్న సంపదను వ్యాపారంలో పెట్టడం.. ఇంటిల్లిపాది కష్టపడడం.. చూశాం. కూరగాయలు పండించడం, పౌల్ట్రీ ఫారాలు పెట్టడం, చిన్న చిన్న వ్యాపార పంటలు పండించడం చేశారు. ఒకప్పుడు కుటీర పరిశ్రమల పేరుతో మహిళలు ఎక్కువగా కనిపించే ఈ రకం వ్యాపారాల్లో యువత ఎక్కువగా కనిపిస్తున్నారు.

2020 పరీక్షల ముందే మూతబడిన స్కూళ్లు.. కాలేజీలు ఈ ఏడాదే మొదలయ్యాయి. ఆన్‌లైన్ విధానం ముగిసి ఆఫ్‌లైన్ క్లాసులకు పిల్లలు హాజరయ్యారు. కానీ రెండేళ్ల సుదీర్ఘ విరామంతో విద్యాప్రమాణాలు దెబ్బతిని చదువులో వెనకబడ్డారు. లాక్‌డౌన్ కాలంలో అనివార్యంగా అలవాటుచేసుకున్న స్మార్ట్‌ఫోను వినియోగం నుంచి పిల్లలు ఇంకా బయటపడలేదు.


నగరాల్లో జీవనోపాధి చేసుకునే చిన్నా, చితక వేతన జీవుల కష్టాలు కోవిడ్ తరువాత మరింత రెట్టింపయ్యాయి. ఆదాయం లేదు.. వ్యయం పెరిగింది. సంపాదించింది పిల్లలకు రెండు పూటలా పెట్టడానికే సరిపోని పరిస్థితుల్లో ప్రభుత్వ స్కూళ్లల్లో అడ్మిషన్లు పెరిగాయి. ముఖ్యంగా అబ్బాయి, అమ్మాయి ఉన్న కుటుంబంలో బాలికలు ప్రభుత్వ బడులకు వెళ్తున్నారు.



ఈ ఏడాది జరిగిన విందులు, వినోదాలు, పెళ్లిళ్లు.. సభలు, సమావేశాలు, విహారయాత్రల వంటివన్నీ కోవిడ్ ముందటి రోజులను గుర్తుచేశాయి. ఒక్కొక్కటిగా ఆంక్షలు ఎత్తివేయడం మొదలైనప్పుడు అక్కడక్కడా కనిపించిన ఈ ధోరణి ఆర్నెళ్లు గడిచేసరికి పూర్తి స్థాయిలోకి మారింది.

సాంకేతికతలో పెద్ద మార్పు

కోవిడ్ తరువాత సాంకేతికత రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఆన్‌లైన్ విద్యా విధానం ప్రారంభించినప్పుడు అందరికీ అందుబాటులోకి రాలేదు. పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యారు. కానీ ఎప్పుడు స్కూళ్లు తెరుచుకుంటాయో.. ఆంక్షలు ఎప్పుడు ఎత్తివేస్తారో తెలియని అయోమయంలో అప్పులు చేసి మరీ స్మార్ట్‌ఫోన్లు కొన్నారు. అప్పటివరకు పిల్లలకు ఫోను దూరంగా ఉంచిన తల్లిదండ్రులు తప్పనిసరిగా ఇవ్వాల్సివచ్చింది. ఇప్పుడు ఆఫ్‌లైన్ వచ్చినా స్మార్ట్‌ఫోనుకు అలవాటుపడిన పిల్లలు ఫోన్లకు అతుక్కుపోతున్నారు. రకరకాల వీడియోగేమ్స్, అడల్ట్ కంటెంట్‌కు అలవాటుపడ్డారు. తీవ్ర మానసిక ఒత్తిడితో పిల్లల ఆరోగ్యం దెబ్బతింటోంది.



ఉద్యోగస్తులు, మధ్య తరగతి కుటుంబాలలో కనిపించే స్మార్ట్‌ఫోను ఇప్పుడు పేద కుటుంబాల్లోనూ కనిపిస్తోంది. అప్పులు చేసి మరీ వేల రూపాయలు పెట్టి ఫోన్లు కొంటున్నారు. క్లాసు రూంలో అర్థంకాని విషయాలు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చన్న అభిప్రాయం విద్యార్థుల్లో వ్యక్తమవుతోంది. మారుమూల గ్రామం నుంచైనా ప్రపంచంలో ఎక్కడెక్కడి పోకడలు అర్థం చేసుకోవచ్చన్న వాదనలు సాధారణ జనంలో బలంగా వినబడుతున్నాయి.

ఆన్‌లైన్ వ్యాపారం..

కోవిడ్ కాలంలో ప్రత్యక్ష వ్యాపార కేంద్రాలన్నీ మూతబడడంతో ఆన్‌లైన్ వ్యాపారం జోరందుకుంది. ముందుగా మందులు, ఇంజక్షన్లు, నిత్యవసరాలతో ఆన్‌లైన్ వ్యాపారానికి అందరూ దగ్గరయ్యారు. ఆ తరువాత కూడా ఏ చిన్న వస్తువు కావాలన్నా ఆన్‌లైన్‌లోనే తెప్పించుకుంటున్నారు. షాపుకు వెళ్లే తీరిక లేక కాదు.. కోవిడ్ కాలంలో అలవాటైన విధానం నుంచి బయటపడకపోవడం.

డిజిటల్ యుగం..

కోవిడ్ తరువాత కాలాన్ని డిజిటల్ యుగంగా పరిగణించాలి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంత అభివృద్ధి సాధించినా దేశ జనాభా డిజిటల్‌కు మారాలంటే చాలా ఏళ్లు పడుతుందన్న అంచనా ఉండేది. కరోనా తరువాత ఆ అంచనా తప్పింది. చిన్నచిన్న దుకాణాల దగ్గర నుంచి తోపుడు బండి మీద వ్యాపారం చేసుకునేవాళ్లు కూడా డిజిటల్ వేదికగా వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నారు. కోవిడ్ సమయంలో అనివార్యంగా అలవాటు చేసుకున్న విధానాన్నే ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. పదుల రూపాయల నుండి లక్షలు, కోట్ల రూపాయల వరకు అన్ని లావాదేవీలు డిజిటల్‌గానే సాగుతున్నాయి.

కోవిడ్ సమయంలో మనం చూసిన ఇంకో మార్పు ఆన్‌లైన్ మీటింగ్‌లు. ఇంట్లోనే కూర్చొని ఎక్కడెక్కడి వారితోనో జూమ్‌లో సమావేశం కావడం అలవాటైంది. సాధారణ జనజీవనం ప్రారంభమైనా ఇప్పటికీ జూమ్ సమావేశాలు జరుగుతున్నాయి.

పాఠాల్లోనే కాదు, ప్రయాణాల్లోనూ ఆన్‌లైన్ వాడకం పెరిగింది. మునుపెన్నడూ లేనన్ని ఆన్‌లైన్ ట్రావెల్ బుకింగ్స్ ఈ మధ్యకాలంలో పెరిగాయి. ఆన్‌లైన్ విధానం ఇప్పుడు ప్రతిఒక్కరి అత్యవసర వినియోగంగా మారింది. నేరస్తులను పట్టుకోవాలన్నా.. మిస్సింగ్ కేసులు ఛేదించాలన్నా స్మార్ట్‌ఫోను ద్వారా సులభంగా కనిపెట్టేయొచ్చని ఎన్నో సందర్భాల్లో రుజువైంది.

మొత్తంగా చూసుకుంటే కోవిడ్ కాలంలో మనకు ఎన్నో చేదు జ్ఞాపకాలు ఎదురయ్యాయి. కానీ, కోవిడ్ తరువాత ప్రజల జీవనయానంలో పెనుమార్పులు వచ్చాయి. మార్పు ప్రతిదీ మంచిదే! అయితే, ఈ మార్పు సామాన్యుల కన్నా పెట్టుబడిదారులకు ఎక్కువగా మేలు చేయటమే గమనార్హమైన సంగతి!

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక
ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి - 522501,
గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

రంగవల్లి





9 చుక్కలు 5 వచ్చేవరకు (మధ్య చుక్క)
దారూరు మద్దమ్మ
బుధవారపేట, కర్నూలు.


కొత్త దర్శకులు .. చిన్న సినిమాలు ...




శ్రీ వశిష్ట

కాలం, తరం మారుతున్న కొలది ఏ రంగంలోనైనా మార్పు, కొత్తదనం అనివార్యం. దాన్ని అందరూ ఆహ్వానించాల్సిందే. సినిమా ఇండస్ట్రీ అందుకు అతీతం కాదు. అయితే తమదైన స్టైల్‌తో జనంలో ఓ ముద్ర వేసుకున్న సీనియర్ దర్శకులు ఈ సంవత్సరం విడుదల చేసిన సినిమాలు ఆశించ ఫలితాలు ఇవ్వలేదు. కానీ, కొత్త దర్శకులు మొదటిసారి తీసిన సినిమాలైనా ప్రేక్షకులను మెప్పించాయి. నిర్మాతలకు లాభాలను చేకూర్చాయి. ఈ దర్శకులు తాము రాసుకున్న కథకు నటీనటులతో తెరకెక్కించి అభిమానులను సంపాదించుకున్నారు.

టాలీవుడ్‌లో స్టార్ దర్శకులుగా రాజమౌళి, త్రివిక్రమ్, సుకుమార్, కొరటాల శివ, పూరి జగన్నాధ్, పరుశు రాం, బోయపాటి వంటి పేర్లు వినిపిస్తాయి. వీరు ఈ ఏడాది విడుదల చేసిన సినిమాలు హిట్ టాక్ తెచ్చుకున్నా... ఆశించిన లాభాలు తీసుకురాలేకపోయాయి. దర్శకుడు కొరటాల శివ చిరంజీవి, రామ్‌చరణ్‌తో 'ఆచార్య' తీశారు. దర్శకుడు పరుశురామ్ మహేష్‌బాబుతో 'సర్కారు వారి పాట', కె రాధాకృష్ణ హీరో ప్రభాస్‌తో 'రాధాశ్యామ్' తీశారు. పూరీ జగన్నాధ్ విజయ్ దేవరకొండతో 'లైగర్' తీశారు. ఇవన్నీ తెలుగు, హిందీ, తమిళం, కన్న, మలయాళ భాషల్లో విడుదల అయ్యాయి. కాని ఆశించినస్థాయిలో విజయాలు రాబట్టలేకపోయాయి. ఇండస్ట్రీకి కొత్తగా పరిచయమైన విమల్ కృష్ణ కేవలం నాలుగు కోట్లతో తీసిన 'డిజె టిల్లు' రూ. 30 కోట్లు రాబట్టింది. టైటిల్‌సాంగ్‌తో యూత్‌ను ఆకట్టుకున్న ఈ సినిమాలో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా పరిచయం అయ్యారు. మొదటి సినిమాతోనే మాస్ హీరోగా ప్రేక్షకులకు దగ్గరయ్యాడు సిద్ధు. మరో కొత్త దర్శకుడు శ్రీ వశిష్ట ... నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా 'బింబిసార' సినిమాను తెరకెక్కించారు. ఫ్యాంటసీ యాక్షన్ ఫిల్మ్‌గా రూపొందిన ఈ చిత్రం రూ. 40 కోట్లు ఖర్చయ్యింది. తర్వాత రూ.65 కోట్లు రాబట్టిందని నిర్మాతలు సంబరాలు జరుపుకున్నారు. చాలా సంవత్సరాలుగా మంచి కథ కోసం ఎదురుచూస్తున్న కళ్యాణ్‌రామ్–కొత్త దర్శకుడు అని ఆలోచించకుండా సినిమా తీసేందుకు ఒప్పుకున్నారు. మంచి సినిమా తీశారన్న పేరు సంపాదించారు. విద్యాసాగర్ చింత కూడా 'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాతో దర్శకుడుగా పరిచయమయ్యారు. లాక్‌డౌన్ టైంలో పెళ్లి కుటుంబాలు పడ్డ కష్టాలను కథగా మలిచి చాలా చక్కగా తెరకెక్కించారు. పెళ్లికాని యువకుడిగా హీరో విశ్వక్‌సేన్ నటించారు. విజయాన్ని సొంతం చేసుకున్నారు. శ్రీ కార్తిక్ దర్శకుడు తీసిన సినిమా 'ఒకే ఒక జీవితం'. శర్వానంద్ హీరోగా నటించారు. సంగీతంలో టాప్ పొజిషన్‌కు రావాలనుకున్న వ్యక్తి జీవితంలో తల్లి మరణం ఏ విధంగా ప్రభావం చూపుతుంది' అనే అంశాన్ని చిత్రంగా మలిచారు. తల్లి కోసం తపన పడే కొడుకుగా పాత్రలో శర్వానంద్ జీవించారు. సైన్సు అంశాలు జోడించడంతో విజ్ఞానంతో ఏదైనా సాధ్యపడుతుందని చెప్పే ప్రయత్నం చేసి మంచి విజయాన్ని అందుకున్నారు శ్రీ కార్తిక్. దర్శకుడు సాయికిరణ్ హారర్ డ్రామా జానర్‌లో రూపొందిన చిత్రం 'మసూద'. మొదటి సినిమాతో ప్రయోగాత్మకంగా తీసి మంచి పేరు సంపాదించారు. ఎన్నో ఏళ్లుగా హిట్ సినిమా కోసం ఎదురుచూస్తున్న అల్లు శిరిష్‌తో 'ఊర్వశివో...రాక్షసివో..' తీశారు దర్శకుడు రాఖేష్ శశి. ప్రేమ, రొమాంటిక్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో కుటుంబ విలువలు ముఖ్యమని చివరగా చెబుతుంది. కొత్త అంశాన్ని వినోదాత్మకంగా రూపొందించి సక్సెస్ సాధించారు. గత రెండేళ్లుగా లాక్‌డౌన్ కారణంగా వాయిదా పడుతూ వచ్చిన సినిమాలన్నీ ఈ ఏడాది భారీస్థాయిలో విడుదలయ్యాయి. దాంతో అగ్ర హీరోల సినిమాల తాకిడి ఎక్కువగా ఉంది. అయినా చిన్న సినిమాలూ విడుదల చేశారు. కొత్త దర్శకులైనా కథల్లో బలం, కొత్తదనం ఉంటే చిన్నవైనా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తాయని ఈ సినిమాల విజయాలే చెబుతున్నాయి.



రాఖేష్ శశి



విమల్ కృష్ణ



విద్యాసాగర్



సాయి కిరణ్



శ్రీకార్తీక్

అశ్విన్, అయ్యర్ కొట్టేశారు

ఢాకా టెస్టులో భారత్ మెరుపు విజయం

2-0తో టెస్టు సిరీస్ టీమ్ ఇండియా వశం

బంగ్లాదేశ్‌కు తప్పని క్లీన్‌స్వీప్ పరాభవం

ఢాకా : రవిచంద్రన్ అశ్విన్ (42 నాటౌట్, 62 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (29 నాటౌట్, 46 బంతుల్లో 4 ఫోర్లు) అసమాన ప్రదర్శనతో బంగ్లాదేశ్‌పై రెండో టెస్టులో భారత్ 3 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 145 పరుగుల ఛేదనలో 74 పరుగులకే 7 వికెట్లు చేజార్చుకున్న భారత్ పరాజయం ప్రమాదంలో పడింది. ఈ పరిస్థితుల్లో భారత్ ఓటమి తప్పించుకోవటం అసాధ్యమే అనిపించింది. అశ్విన్, అయ్యర్ జోడీ ఎనిమిదో వికెట్‌కు అజేయంగా 71 పరుగులు జోడించింది. ఆతిథ్య బంగ్లాదేశ్‌కు క్లీన్‌స్వీప్ పరాభవం మిగిల్చింది. బంగ్లాదేశ్ స్పిన్నర్ మెహిది హసన్ మిరాజ్ (5/63) ఐదు వికెట్ల మాయ చేసినా.. అశ్విన్, అయ్యర్‌పై పైచేయి సాధించటంలో విఫలమయ్యాడు. రవిచంద్రన్ అశ్విన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా, చతేశ్వర్ పుజారా 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. రెండు టెస్టుల సిరీస్ ట్రోఫీని భారత్ సొంతం చేసుకుంది. వన్డే సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-1తో గెలుపొందగా, టెస్టు సిరీస్‌ను భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంతో బంగ్లాదేశ్ పర్యటనను భారత్ విజయవంతంగా ముగించింది.



ఓటమి భయం! : ఓవర్‌నైట్ స్కోరు 45/4తో నాల్గో రోజు ఛేదనకు వచ్చిన టీమ్ ఇండియాకు తొలి గంట కలిసిరాలేదు. అక్షర్ పటేల్ (34, 69 బంతుల్లో 4 ఫోర్లు), జైదేవ్ ఉనద్కత్ (13, 16 బంతుల్లో 1 సిక్స్)తో పాటు ధనాధన్ హిట్టర్ రిషబ్ పంత్ (9) డ్రింక్స్ విరామం లోపే పెవిలియన్‌కు చేరారు. నైట్‌వాచ్‌మన్ జైదేవ్ ఉనద్కత్‌ను షకిబ్ అవుట్ చేయగా.. ఫామ్‌లో ఉన్న బ్యాటర్ రిషబ్ పంత్ (9) వికెట్‌తో మెహిది హసన్ మిరాజ్ బంగ్లాదేశ్ శిబిరంలో ముందస్తు సంబురాలకు తెరతీశాడు. నిలదొక్కుకున్న అక్షర్ పటేల్ సైతం మెహిది హసన్‌కు దొరికిపోయాడు. 74 పరుగులకే 7 వికెట్లు చేజార్చుకున్న టీమ్ ఇండియా ఓటమి కోరల్లో నిలిచింది. టెస్టు క్రికెట్ చరిత్రలో బంగ్లాదేశ్ ఎన్నడూ భారత్‌పై ఐదు రోజుల ఆటలో విజయం సాధించలేదు. సొంతగడ్డపై బంగ్లాదేశ్ తొలిసారి భారత్‌పై టెస్టు విజయానికి అత్యంత చేరువగా నిలిచింది.

అశ్విన్, అయ్యర్ అదుర్స్ : ఉదయం సెషన్ డ్రింక్స్ విరామానికి ముందు బంగ్లాదేశ్ జోరు చూపించగా.. డ్రింక్స్ విరామం అనంతరం భారత్ దూసుకెళ్లింది. శ్రేయస్ అయ్యర్ (29 నాటౌట్), రవిచంద్రన్ అశ్విన్ (42 నాటౌట్) అసమాన పోరాట పటిమ చూపించారు. స్పిన్ వలలో సహచర బ్యాటర్లు చిక్కుకోగా.. స్పిన్‌పై ఆత్మరక్షణ, ఎదురుదాడి ఎలా చేయాలో ఈ జోడీ చూపించింది. ప్రమాదకర బంగ్లా స్పిన్నర్లను గౌరవిస్తూనే వేగంగా పరుగులు పిండుకుంది. అశ్విన్ 4 బౌండరీలు, ఓ సిక్సర్‌తో మెరువగా.. అయ్యర్ నాలుగు బౌండరీలతో కదం తొక్కాడు. ఈ జోడీ వేగంగా పరుగులు చేయటంలో స్వల్ప లక్ష్యం అలా కరిగిపోయింది. 8వ వికెట్‌కు అజేయంగా 71 పరుగులు జోడించి బంగ్లాదేశ్ ఆశలను ఆవిరి చేసింది. ఐదు వికెట్ల మాయగాడు మెహిది హసన్ మిరాజ్ ఓవర్లో రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో ధనాధన్ దంచికొట్టిన అశ్విన్ లంచ్‌కు ముందే లాంఛనం ముగించాడు.

స్కోరు వివరాలు :
బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ : 227/10
భారత్ తొలి ఇన్నింగ్స్ : 314/10
బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ : 231/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : గిల్ (స్టంప్డ్) నురుల్ హసన్ (బి) మెహిది హసన్ 7, కెఎల్ రాహుల్ (సి) నురుల్ హసన్ (బి) షకిబ్ 2, పుజారా (స్టంప్డ్) నురుల్ హసన్ (బి) మెహిది హసన్ 6, అక్షర్ (బి) మెహిది హసన్ 34, కోహ్లి (సి) మోమినుల్ (బి) మెహిది హసన్ 1, జైదేవ్ (ఎల్బీ) షకిబ్ 13, పంత్ (ఎల్బీ) మెహిది హసన్ 9, అయ్యర్ నాటౌట్ 29, అశ్విన్ నాటౌట్ 42, ఎక్స్‌ట్రాలు : 2, మొత్తం :(47 ఓవర్లలో 7 వికెట్లకు) 145.

వికెట్ల పతనం : 1-3, 2-12, 3-29, 4-37, 5-56, 6-71, 7-74.

బౌలింగ్ : షకిబ్ అల్ హసన్ 14-0-50-2, తైజుల్ ఇస్లాం 11-4-14-0, మెహిది హసన్ 19-4-63-5, టస్కిన్ అహ్మద్ 1-0-4-0, ఖలీద్ అహ్మద్ 1-0-12-0.



ఆర్చర్ల బంగారు గురి

5 స్వర్ణాలు, 3 రజతాలు, 1 కాంస్యం సొంతం

షార్జా (యుఏఈ) : భారత జూనియర్ ఆర్చర్లు అదరగొట్టారు. జూనియర్ ఆసియా కప్ 2022లో పతకాలు కొల్లగొట్టారు. ఐదు స్వర్ణాలు, మూడు రజతాలు, ఓ కాంస్య పతకంతో అగ్రస్థానంలో నిలిచారు. కాంపౌండ్ విభాగంలో భారత ఆర్చర్లు దాదాపు క్లీన్‌స్వీప్ చేశారు. మహిళల వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో ప్రగతి, ఆదితి, కౌర్‌లు తొలి మూడు స్థానాల్లో నిలిచి స్వీప్ చేశారు. ప్రియాన్ష్, ఒజెశ్‌లు మెన్ వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో పసిడి, రజత పతకాలు సాధించారు. రికర్వ్ జట్టు దక్షిణ కొరియాను 6-4తో ఓడించి మరో స్వర్ణ పతకం అందించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68